


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14   సంచిక: 12   హైదరాబాద్     2014   ఏప్రిల్   పేజీలు 40

**Please visit :  www.srimeherbaba.com**    వార్షిక సభ్యత్వం : రూ.100/-

# శ్రీకాకుళం కేంద్రం - ఆధ్యాత్మిక అవగాహన సదస్సు 2014 మే 9,10&11

**శ్రీకాకుళం కేంద్రం ఆధ్వర్యంలో** మే 9 ఉదయం 9 గం॥ నుండి మే 11 మధ్యాహ్నం వరకు ఒక ప్రత్యేక **ఆధ్యాత్మిక అవగాహన సదస్సు** నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి.వి. రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో అవతారుడు ప్రవచించిన భగవత్ వచనము అంశంపై శ్రీ రఘపతి రావు గారు, బెంగళూరు, అవతారుని ప్రవచనములు - శ్రీ కె. కెంకటరావు గారు, విశాఖపట్నం, బాబా సందేశములు & సందేహ నివృత్తి - శ్రీ తోట నాగేశ్వర రావు గారు, కాకినాడ తదితరులు ప్రసంగించనున్నారని శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు 18 ఏళ్ళు నిండిన కేవలం 100 మంది స్త్రీ పురుష బాబా ప్రేమికులు మాత్రమే అర్హులు. వీరికి భోజన, తగిన వసతి ఏర్పాట్లు బాబా కేంద్రం ఏర్పాటు చేస్తుందని, అందుకుగాను విరాళంగా రూ. 200/- ఆసక్తిగల పాల్గొనగోరువారు చెల్లించాలని ఆయన అన్నారు. ఆసక్తిగలవారు తమ వివరాలను 2014 ఏప్రిల్ 30 లోగా శ్రీ పి.వి. రంగప్రసాద్, కార్యదర్శి, (99850 26433), శ్రీ పి.వి.ఎన్.రవీంద్రనాథ్, (80199 99669, 76599 95993) తెలియజేయాల్సిందిగా కోరారు.

## వివాహము

శ్రీమతి & శ్రీ దాసరి వెంకటేశ్వర రావు గారి కుమారుడు చి॥ నరేష్ వివాహము చి॥సౌ॥ శరణ్యతో 2014 ఏప్రిల్ 18, శుక్రవారం ఉ. 11.02 ని॥లకు యస్.వి.యన్. లేక్ ప్యాలస్, లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ ప్రక్కన, విజయనగరంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

## జలనిధి

గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

# బాబా సందేశం

**Until you see the world worthless,**
**you cannot see ME.**

నిత్యం నీవు చూస్తున్న ఈ సమాజం ఎందుకూ పనికిరాదని
తెలుసుకునేదాకా, నీకు భగవంతుని దర్శనం లభించదు.

**- MEHER BABA**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. గుజరాతీ సహవాస్ 6-12
3. అవతారుని ఆరతి 13
4. హిందీ హారతి - అది సచేతన 14
5. అది సచేతనకు - తెలుగు సేత 15
6. గుజరాతీ ఆరతి 16
7. బుర్ఖూవే ఆరతి - తెలుగు అనువాదం 27-29
8. విద్యార్థులకు సందేశం 18-19
9. లార్డ్ మెహెర్ 20-27
10. ఆదీ, ఏరుచ్‌లు - భరత-లక్ష్మణులు 28
11. ఆదీ.కె.ఇరానీ 29-39



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# బెంగళూరులో సహవాస్

## 2014 జూన్ 14,15 తేదీలలో

బెంగళూరులోని జయానగర్‌లో అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో ప్రత్యేక సహవాస్ కార్యక్రమం 2014 జూన్ 14,15 తేదీలలో ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎ. రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. **ఈ** సందర్భంగా స్థానిక సెంటర్ ప్రాంగణంలో మెహెర్‌బాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. అవతారుని నిలువెత్తు పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ రాజగోపాల్ కోరుతూ, తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా హాజరుకాగోరు బాబా ప్రేమికులు తమ వివరాలు email: avatarmeherbababangalore@gmail.com, **లేదా** C/o 1186/ 14, 35th C Cross, 26th Main, 4th Block, Jaya Nagar, Bangalore - 41, Smt. Narmada (09980522414), Sri Rajagopal (09845697738) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.

# వెంకోబరావు బాబాలో ఐక్యం

ఖైరమంగళ విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం, బెంగుళూరు బాబా ప్రేమికులు శ్రీ వెంకోబరావు 2014 ఏప్రిల్, 12 మధ్యాహ్న సమయంలో బాబాలో ఐక్యమయ్యారు. అతి చిన్న వయస్సులో అవతారుని సేవకునిగా చేరి, కడదాకా బాబా నామ స్మరణలోనే గడిపిన వెంకోబరావు ధన్యజీవి.

# విరాళాలు

శ్రీ మెహెర్ సుకృత్, పూనె, రూ. 5000/-, శ్రీమతి రాధ, వరంగల్, రూ. 500/- మెహెర్‌బాబా మాస పత్రిక నిర్వహణలో భాగంగా ఏప్రిల్ మాసంలో విరాళాలు అందజేశారు.

# పావగడ సెంటర్ రజతోత్సవం

అవతార్ మెహెర్‌బాబా పావగడ సెంటర్, తుంకూర్ జిల్లా, కర్ణాటక, రజతోత్సవ వేడుకలు 2014 జూన్ 3,4,5 తేదీలలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాబా ప్రేమికులు 1) రఘుపతి - మెహెర్‌గడ (పావగడ) - 098804 62970, 2) ఏ.వి.జి. హరిప్రసాద్ - బెంగుళూరు - 099862 76741, email: meherd.meher77@gmail.com సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

సంపాదకీయం

# సహవాస్‌ల సమయం

అమరతిథి, జన్మదినోత్సవాలు ముగిసాయి.
సహవాస్‌ల సమయం ప్రారంభమయింది.
మహారాష్ట్రలోని పూనే బాబా సెంటర్ వార్షికోత్సవ సంబరాలు
2014 మే 1, 2 లలో పెద్ద ఎత్తున ఏర్పాటుచేశారు.
జూన్ మాసంలో కర్నాటకలోని పావగడ, బెంగళూరులలో
అలాగే, ఇటీవల గుంటూరు, ఖమ్మం సెంటర్‌ల వార్షికోత్సవ సహవాస్
కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి.
శ్రీకాకుళంలో ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు,
హైదరాబాద్‌లో యువత కోసం ప్రత్యేక శిక్షణా శిబిరాలు మే మాసంలో
ఏర్పాటు చేసిన సంగతి పాఠకులకు తెలుసు.
బాబా కేంద్రాలలో వారం వారం జరిగే సత్సంగ్‌లకు అదనంగా
ఈ ప్రత్యేక సహవాస్‌లు జరుగుతున్నాయి.
బాబా ప్రేమికులు సయితం శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ దాకా అన్నట్లు,
దూరాభారాలను, వయోభారాన్ని, ఆరోగ్య, ఆర్థిక సమస్యలను పట్టించుకోకుండా
ఎంతో ఉత్సాహంగా బాబా కార్యక్రమాలన్నింటికీ అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.
తెలుగునాట నిత్యం అవతారుని నామస్మరణ విస్తృతంగా జరుగుతోంది.
ఇదంతా అవతారుడే తన కార్యక్రమాన్ని నిర్దిష్ట పద్ధతిలో
జరుపుకుంటున్నారనడంలో సందేహం ఏముంది?
మనం ఎన్ని కార్యక్రమాలు ఎంత పెద్దగా చేసినా,
అవతారుని నామస్మరణలో, ఆయన సేవలో గడపాలన్నదే
ప్రధాన ఆశయం. ఐతే, బాబా పలుమార్లు తన ప్రవచనంలో చెప్పిన
మాటల్ని ప్రతి కార్యక్రమం వెనుక మననం చేసుకోవడం సముచితం.
బాబా ఏమన్నారు...
**"మీ చుట్టుప్రక్కల చూస్తున్న ప్రపంచం ఏమాత్రం నిజం కాదు.
అది కేవలం భ్రాంతి. ఈ విషయం తెలుసుకొనేదాకా నా దివ్యదర్శనం
మీరు పొందలేరన్నారు."**
మరి ఎవరి అనుభవం వారిది. అది పూర్తిగా వ్యక్తిగతం!!

# గుజరాతీ సహవాస్

## 1955 నవంబర్ 3

అలాగే చనిపోయిన ఒక పిల్లవాడిని బ్రతికించానంటే, ప్రజలు నావెంట తండోపతండాలుగా వస్తారు. నాపట్ల అత్యంత విధేయత ప్రదర్శిస్తారు.
గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నుండి వచ్చిన రవికాంత్ రావల్ తన అనుభవాన్ని వివరిస్తూ, తమ ప్రాంతంలో ఒక ప్రేమికుడు బాబా నామాన్ని జపించడం వల్ల తీవ్ర కరువు సమయంలో మంచి వాన కురిసిందని చెప్పాడు.
దీనికి జవాబుగా బాబా అన్నారు కదా రవికాంత్ చెప్పినదాన్ని అనుమానించవల్సిన పన్లేదన్నారు. తన కళ్ళతో చూసినదాన్ని నమ్మకంతో రవికాంత్ చెప్పాడు.
ఐతే, నిజానికి ఆ విషయాలేవి నేను చేయలేదు, నాకేమీ తెలియదన్నారు బాబా.
నౌజర్ దాదా ఛాంజీ నన్ను అమితంగా ప్రేమిస్తాడు. ఆయన కుటుంబ సభ్యులు అందరూ నన్ను ప్రేమిస్తారు. అకస్మాత్తుగా నౌజర్ మరణించినప్పుడు వాళ్ళ కళ్ళలో చిన్న నీటి చుక్కైనా లేకుండా వారు నాపట్ల విధేయులుగా వున్నారు.
ఇలా నా మాటలు ఆలకిస్తూ, నేనేదో సంత్ సత్పురుషుడు, ఏదో గొప్పవాడినని భావిస్తారు. కానీ, మీకు నేను భగవంతుడిని అనే అనుభవం లేదు.
ఆ అనుభవం పొందాక, మీరు నాకు విధేయులుగా ఉండటంలో గొప్పేమీ లేదన్నారు బాబా. నా దివ్యత్వం గురించి ఏమాత్రం తెలియనప్పుడే, నాపట్ల విధేయులుగా ఉండటంలో ఎంతో గొప్పదనం వుందన్నారు బాబా.
ఇలాంటి విధేయత పట్ల సాధారణంగా మనస్సు ఎదురు తిరుగుతుంది.
బాబా మండలి సభ్యుడు కైకోబాద్ దస్తూర్ గురించి బాబా ప్రస్తావిస్తూ, అతనికి నా గురించి తెలుసు. అతను తరచూ దివ్యానందం అనుభవిస్తుంటాడు. నేను కనుక అతని కుటుంబ సభ్యుల్ని ముక్కలుముక్కలుగా నరికివేయమంటే, సంపూర్ణ విధేయతతో ఆనందంగా, క్షణకాలమైనా ఆలోచించకుండా ఆ పని పూర్తిచేసేస్తాడు. ఎందుకంటే అతనికి నా దివ్యావతార అనుభవం, అనుభూతి అపారంగా వుంది కనుక. కానీ, నేనెవరో తెలియకుండా నాపట్ల విధేయులుగా వుండటం చాలా గొప్ప విషయం. ఇది నిజం.
ఏదిఏమైనా నాపట్ల విధేయులుగా వుండటం అసాధ్యం.
నేను, మీలో ఒకడిగా మీ స్థానంలో వున్నట్లయితే, ఆ మాదిరి విధేయత నాకూ ఉండదన్నారు బాబా. ఐతే, నా నిజరూపం – దివ్యావతారం గురించి ఏమీ తెలియనప్పుడు నాకు విధేయులుగా ఎలా వుండగల్గుతారని బాబా ప్రశ్నించారు.

బాబా ఇంకా ఇలా అన్నారు...
విధేయత అసాధ్యమయితే, మీకు మరో మార్గం సూచిస్తానన్నారు.
అదేమంటే, హృదయం పరిశుభ్రంగా వుంచుకోమన్నారు.
ఇందుకు మూడు మార్గాలున్నాయి.

1) మొదటిది విధేయత
2) రెండవది పరిశుభ్ర హృదయం
3) మూడవది నిస్వార్థ సేవ.

మీ హృదయాలను శుభ్రంగా వుంచుకోవాలంటే చాలా కష్టం. అసలు హృదయాన్ని పరిశుభ్రం ఎలా చేస్తారు? దానికేమైనా ప్రత్యేక విధానముందా?
ఈ సమాజాన్ని, ప్రపంచాన్ని వదలి ఎక్కడో మారుమూల ఏకాంతంగా కూర్చుంటే హృదయం పరిశుభ్రమవదు. ఈ సమాజంలో బ్రతుకుతూనే హృదయాన్ని పరిశుభ్రంగా వుంచుకోవాలి. ఉదాహరణకు నీకు ఎవరి మీదనో కోపం వస్తుంది. నీకు అనేక చెడు ఆలోచనలు వస్తుంటాయి. అలాంటప్పుడు ఏం చేయ్యాలి?
ఆ సమయంలో బాబావారిచ్చిన సలహా ఏమంటే ఎలాంటి చెడు ఆలోచనలు వచ్చినా – ఏమీ పట్టించుకోవద్దు. వాటి మానాన వాటిని రానీయండి.
వాటిని అడ్డుకోవద్దు. కొన్ని సందర్భాల్లో కోపం రావడం కూడా ఒకందుకు మంచిదే. అలా కోపం వచ్చినప్పుడు ఆవేదన, ఆవేశంతో నిలువెల్లా వూగిపోతావ్.
నీకే కనుక కోపం రాకపోతే, ఆ సమయంలో నేనెందుకు అలా ప్రవర్తించానా? అనే ఆలోచించే అవకాశం నీకు రాదు. అంతేకాదు, కామంతో కూడిన ఆలోచనలూ వస్తాయి. అలాంటి ఆలోచనలు వస్తాయి. వాటిని రానీయండి.
అలా వస్తాయి. ఐతే, అలాంటి కామ ప్రేరిత ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని ఆచరణరూపంలో అమలు చేయకండి. ఆలోచనలు రాకపోతే విశేషం ఏముంది. రివ్వున వీచే గాలిలా అనేక రకాల ఆలోచనలు రావడం సహజం!!
వాటిని అడ్డుకోవద్దు. పట్టించుకోనూ వద్దు. వీటన్నింటికీ కారణం, గతజన్మ సంస్కారాల ప్రభావం అని బాబా అన్నారు. పరిణామ క్రమంలో జంతువుల స్థాయి నుండి మానవునిగా పరిణితి సాధించినా గతజన్మ సంస్కారాల వల్ల కోపం, కామం, ఆశ, మానవుల్ని వెన్నంటే వుంటాయి. ఈ సంస్కారాల ప్రభావం వల్లనే అహర్నిశం అనేక ఆలోచనలు మనస్సులో రగిలిపోతుంటాయి.
తాత్కాలికంగా ఇలాంటి ఆలోచల్ని అదుపులో వుంచే ప్రయత్నం మీరు చేసినా కొన్ని వాటంతటవే బహిర్గతమౌతుంటాయి. ఐతే, మీరు ఆ ఆలోచనల్ని అచరణలో అమలు చేస్తే తిరిగి సంస్కార బంధనంలో చిక్కుకుంటారు. ఈ సంస్కార బంధనంలో మాత్రం ఏముంది. ఇదీ ఈ మాయాజగత్తులో భాగమేనన్నారు బాబా.

మీరు చూస్తున్నదంతా పెద్ద సున్నా అన్నారు. ఒక్క క్షణంలో మీకెందుకో కోపం వస్తుంది. ఆ కోపాన్ని ఎవరో ఒకరి మీద ప్రదర్శించకపోతే ఏమవుతుంది? నీ మనస్సుకి కోపం వస్తుంది. ఆ విషయం మీ హృదయానికి తెలియకూడదు. అదెలా సాధ్యం? అంటే దానికొక మార్గం వుంది. నీకు కోపం వచ్చినా, దురాలోచనలు మరొక ఆలోచన వచ్చినా, వాటిని బయటకు అందరికీ కనిపించేలా ప్రదర్శించకుండా జాగ్రత్తపడు. ఏదో విషయంలో, మీకు కోపం వచ్చిందనుకోండి!!

వెంటనే, ఆ మరుక్షణంలోనే కోపాన్ని ఎదుటివానిపై ప్రదర్శించకుండా బాబా - బాబా అని నామస్మరణ చేయండి. ఆ సమయంలో నా నామాన్ని గుర్తుకు చేసుకోండి. ఇదే మాదిరిగా, ఏదైనా చెడు ఆలోచన, కామ పూరిత ఆలోచన వచ్చినా హృదయ పూర్తిగా బాబాను తలుచుకోండి. ఇది చాలా గొప్ప విషయం.

మీరు ఉద్రేకంగా కోపంతో వున్నప్పుడు బాబా నామం స్మరించి, అన్నింటినీ మరచిపొమ్మనడమంటే చిన్న పిల్లల ఆట ఏమాత్రం కాదు. ఇదేమీ ఆషామాషీ విషయం కాదు. కోపం రారాదు. అలా వచ్చినప్పుడు ఎదుటివానిపై గట్టిగా అరిచేస్తేనే ఆ కోపం పోతుంది. అలాంటిది బాబా నామస్మరణ చేయండమని సలహా ఇవ్వడం సులభమే. ఆచరణలో పెట్టడం చిన్నపాటి విషయం ఏమాత్రం కాదని బాబా అన్నారు. అలా అంటూనే, ఆ సమయంలో 'బాబా - నామమే' స్ఫురణకు రాకపోవచ్చు కూడా.

అలాంటప్పుడు మరో మూడో మార్గం వుందని సూచించారు.

అదే **'నిస్వార్ధ సేవ'** అన్నారు.

మీరొకవేళ బాబా పట్ల విధేయులుగా ఉండలేకపోతే మీ హృదయాలను పరిశుభ్రంగా వుంచుకోండి. కోపం వస్తే బాబా నామం స్మరించండి అన్నారు బాబా.

మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచి పనులు ద్వారా హృదయాలు పరిశుభ్రమౌతాయి. అంతేకానీ ఏదో మన శాస్త్రాలు చెప్పినవాటిని వల్లెవేయడం ద్వారా ఏమాత్రం కాదని బాబా అన్నారు. తన చిన్నతనం నాటి జ్ఞాపకాన్ని బాబా వివరిస్తూ మా అమ్మ అగ్ని దేవాలయానికి వెళ్ళమని గట్టిగా చెప్పింది. ఆమె గోడు భరించలేక అలాగే గుడికెళ్ళాను. పార్శీయులకు ఆరాధ్య దైవం జొరాస్టరు. జొరాస్టరు ప్రవచించిన పవిత్ర గ్రంథం 'అవెస్థా'. నేనా గ్రంథం చదువుతూ - కొన్ని పేజీలు చదవకుండానే ముందుకెళ్ళి అంతా చదివేసినట్లు పుస్తకాన్ని ప్రక్కన పెట్టాను. ఒక రోజున నేనేమో గోళీలు, గాలిపటాలు ఎగుర వేసుకుందామనుకుంటుంటే, ఇది దేవుడ్ని ప్రార్ధించే విధానం కాదు. దేవుడిని అత్యంత శ్రద్ధతో ప్రార్ధించాలి. నేనయితే మా అమ్మ గోడు భరించలేక అలా చేశాను. దేవుడ్ని శ్రద్ధగా ప్రార్ధించలేకపోతే, గమ్మునుండటమే మంచిదన్నారు బాబా. నిస్వార్ధసేవ చేయడం కూడా సులభమైన

విషయం ఏమాత్రం కాదు. అలాంటి సందర్భంలో నా నామమే నిరంతరం స్మరించుకునేందుకు ప్రయత్నించండన్నారు. అదీ చాతకాని పక్షంలో, కనీసం మీ తుదిశ్వాస సమయంలో నా నామం స్మరించాలని గుర్తుంచుకోండి.
మీ జీవిత చరమాంకంలో, ప్రాణంపోయే సమయంలో నా నామం స్మరించుకోవాలని గుర్తుంచుకోవాలంటే, నేటి నుండీ నా నామస్మరణ చేయడం ప్రారంభించండి!
లేదంటే, మీ తుదిశ్వాస సమయంలో నా నామం మీకు **యాద్‌కి** రాదని బాబా హెచ్చరించారు. ఈ వేళ్టికి ఇది చాలు. మిగిలిన విషయాలు రేపు చెప్పుకుందాం!! రేపట్నుండి మూడు నాలుగు రోజులు నాతో మీరందరూ ప్రశాంతంగా, హాయిగా సంతోషంగా గడపండి అన్నారు.

**కోహియార్**

కోహియార్ అనే బాబా సహవాసీని భగవంతుని ప్రార్ధన (బినమ్-ఇ-యాజదాన్) బిగ్గరగా చేయమన్నారు. అనంతరం ఆ ప్రార్ధనను ఇంగ్లీషులో అనువదించి, బాబానే దాని అర్ధం వివరించారు. ఆ తర్వాత ఉదయం 10.30 నుండి ఒక అర్ధగంట నవసారి ప్రేమికులు భజన గీతాలు ఆలాపిచారు. 11 గంటలకు అందరూ లంచ్‌కు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం పూర్తయ్యాక, 12.30 సమయంలో మధ్యాహ్నం నిద్రతో నడుం వాల్చకుండా వున్న కొంతమందిని బాబా తన దగ్గరకు పిలిచారు. కొంతమంది భజన గీతాలు ఆలాపిస్తున్నారు.
రవికాంత్ రావత్ అనే ప్రేమికుడు నలుగురు దొంగల కథని చెప్పాడు.
ఆ కథ విన్న బాబా, పంచ సద్గురువులను ఐదుగురు దొంగలతో పోల్చుతూ, వారు తన భక్తుల హృదయాలను దోచుకుంటారని అన్నారు.
ఓ గంట తర్వాత స్థానిక ఆరంగాం గ్రామస్థులకు దర్శనం ఇచ్చారు.
వీరిలో చాలామంది ప్రస్తుత సహవాస్ కార్యక్రమ ఏర్పాట్లలో కూలీ పని చేస్తున్నవారు వున్నారు. వారందరూ భజన గీతాలు పాడుతూ, నాట్యం చేస్తూ, పెద్ద ఊరేగింపుగా బాబా దగ్గరకు వచ్చారు. వారందరికీ బాబా పాదాలు తాకవద్దని ముందుగానే హెచ్చరించారు. ఈ సమయంలో సాకోరీలోని ఉపాసనీ ఆశ్రమం నుండి గోదావరి మాయి వచ్చింది. ఆమెకు బాబా తన ప్రక్కనే కుర్చీ వేసారు. స్థానిక ఆరంగాం గ్రామస్థులు పూల మాలలు వేసారు. కర్పూర హారతలు ఇచ్చారు. కొబ్బరి కాయలు కొట్టారు. బాబా వారందరికీ ప్రేమతో ప్రసాదం ఇచ్చారు. ఆ కార్యక్రమం అనంతరం తిరిగి సహవాస్ కొనసాగింది. బాబా తన ప్రేమికులను ఉద్దేశించి ప్రతి గ్రూపు నుండి ఒక్కొక్కరు చొప్పున ఫిబ్రవరి 15 నుండి 21 రోజుల పాటు నిరంతరంగా బాబా **నామజపం** బిగ్గరగా చేయ్యాలన్నారు. అందుకు ఒక ప్రత్యేక నియమం సూచించారు. ఈ 21 రోజులలో నామజపం చేసేవారు కేవలం మంచినీళ్ళు మాత్రమే తీసుకోవాలి.

21 రోజుల పాటు మంచినీళ్ళు త్రాగుతూ ఉపవాసం ఉండటం పెద్ద కష్టమైనదేమీ కాదు. గతంలో ఎందరో ఇలా ఎన్నో రోజులు కఠిన ఉపవాసం ఉన్నారు.
అయితే అందరూ ఒక్కచోట ఉండి, ఒకరు బిగ్గరగా నామం చెపుతుంటే, మరికొందరు వింటూ ఉండటం – కొద్దిగా కష్టమైన విషయం.
అయితే మీలో ఎవరైతే ఈ పనికి పూనుకునేందుకు సిద్ధంగా వున్నారో – ధైర్యంగా వున్నారో, వారు లేచి నిలబడమన్నారు. చాలామంది లేచి నిలబడ్డారు. వారిలో నుండి కేవలం ఐదుగుర్ని వరుసగా
1. హెచ్.పి. భరూచా, 2. మినూ ఖరాస్, 3., బర్జోర్ మెహెతా,
4. ఏరుచ్ కరాడియా, 5. మినూ. ఎఫ్. ఖంబాటాలను మాత్రమే బాబా ఎంపికచేశారు.
21 రోజులు మీరందరూ ఒకే ప్రదేశంలో ఉండండి. మంచినీళ్ళు తప్ప ఏమీ త్రాగవద్దు. నిద్రపోకుండా, ఈ 21 రోజులు, బాబా నామం బిగ్గరగానే జపించండి.
ఆ తర్వాత అవసరమొస్తే మరిన్ని సూచనలు ఇస్తానన్నారు.
భగవంతుడు చెవిటివాడు. మీరు మనస్సులో తలచుకుంటే నాకేమీ వినపడదు. నేనూ చెవిటివాడినే! ఎలాంటి కష్టం ఎదురైనా, నే చెప్పిన ఈ సూచనలు పాటిస్తూ, మూడు వారాలపాటు మంచినీళ్ళు త్రాగి – నామ జపం బిగ్గరగా చేయండి!!
బాబా ప్రేమికులు, ముఖ్యంగా తెలుగువారు, 24 గంటలపాటు ఏకాహం నిర్వహించేవారు. ప్రస్తుతం అర్ధ ఏకాహం ఉ. 5 నుండి సా. 5 దాకా చాలాచోట్ల నిర్వహిస్తున్నారు. బాబా నవ్వుతూ, నేను ఈరోజు మెహెరాబాద్‌కు సాయంత్రం 5 గంటలకు వెళ్ళొచ్చా? అని ప్రేమికుల సలహా అడిగారు.
అందరూ – ఉమ్మడిగా – గట్టిగా – వద్దు బాబా!! అన్నారు.
బాబా కూడా సరేనన్నారు. మీ కోరికను మన్నిస్తానన్నారు.
ఐతే, నేను సాయంత్రం 5 గంటలకు కాకుండా 4.30 కి వెళ్తానన్నారు.
తిరిగి అందరూ 'వద్దు బాబా' అని గట్టిగా ప్రతిఘటించారు. అలాగైతే, చర్చోపచర్చలు వాదనలు – అన్నీ అయ్యాక – చివరాఖరికి సాయంత్రం 5.30 కి బాబా మెహెరాబాద్ వెళ్ళడానికి అందరూ అంగీకరించారు. సాయంత్రం 6 గంటలకు బాబా వెళ్ళాల్సి వుంది. బాబా తన సహజ ధోరణిలో మరో అర్ధగంట ముందుగానే వెళ్ళారు.
అమెరికాలో ప్రింటయ్యి క్రొత్తగా తెచ్చిన 'భగవద్వచనం" గాడ్ స్పీక్స్ తొలి ప్రతులపై బాబా తన అమృత హస్తాన్ని ఉంచారు. అతి త్వరలో ఈ గ్రంథం ప్రతులు అందరికీ అందుతాయన్నారు. ఈ గ్రంథంలో తాను అనేక ఆధ్యాత్మిక విషయాలు ప్రస్తావించానన్నారు. ఆ విషయంలో కొన్నింటిని క్లుప్తంగా ఈరోజు మీకు వివరిస్తానన్నారు. ఎన్నో విధాలుగా మనందరం ఒక్కటే. ఆ విషయం మనకు తెలియదు. ఆ ఎరుకే మనలో ఎవరికీ లేదు.

యుగయుగాలుగా అనంత మహాసాగరంలో మనందరం వున్నాము.
ఆ మహాసముద్రంలో ఒక్కొక్కరం ఒక్కొక్క నీటి బిందువులం!!
ప్రతి రోజూ ఎలా వుంటుంది? పగలంతా కష్ట పడతాం – రాత్రికి నిద్రకు ఉపక్రమిస్తాం. నిద్ర పోదామని మంచం ఎక్కగానే గాఢ నిద్రలోకి జారుకుంటామా? గాఢ నిద్రలోకి జారుకునే ముందు కొద్దిసేపు అనేక విషయాలపై కలలు వస్తుంటాయి. అలాగే, తెలతెల్లవారుతుండగా, తిరిగి, నిద్ర నుండి మెలకువ వచ్చే సమయంలో కొద్దిసేపు కలల ప్రపంచంలో ఓలలాడతారు!!
మంచి గాఢ నిద్రలో ఉన్నప్పుడు నీవు అన్నీ మర్చిపోతావు.
నీకు ఈ ప్రపంచంలో దేనితోనూ సంబంధం ఉండదు.
ఇదే యదార్ధ స్థితి. నిత్యం మీలో అందరూ ఈ స్థితులు అనుభవిస్తూ ఉంటారు. కలలు కంటూ – గాఢ నిద్రలోకి జారుకోవడం, తిరిగి ఆ నిద్ర నుండి కలల ప్రపంచంలో కొద్ది సేపు అలా అలా ఒదిగి – మెలకువతో ఈ ప్రపంచంలోకి వస్తుంటారు!
ఈ స్థూల ప్రపంచం కూడా, ఒకరకంగా 'కలలు కనే స్థితి' అని బాబా అన్నారు.
మనం ఏం చేయాలి? అని బాబా ప్రశ్నిస్తూ ప్రతిరోజూ రాత్రవ్వగానే గాఢ నిద్రలోకి జారుకోవడం ఆ తర్వాత తిరిగి మెళకువ వచ్చాక ఈ కలల ప్రపంచంలో బ్రతకడం గురించి మనం ఏదైనా చేయాలన్నారు. నడిరాత్రి – గాఢ నిద్రలో వున్న సమయంలో మనందరి స్థితి ఒక్కటే! మెళకువగా ఉన్నప్పుడే – ఈ ద్వంద్వంలో వుంటాం.
గాఢ నిద్ర స్థితి వల్ల ఒరిగేదేమీ లేదు. ఈ సమయంలోనే చైతన్యంతో మీరు మెళకువతో వుంటే **అందరం ఒక్కటే!** అనే నిజాన్ని తెలుసుకోగలుగుతారు. అది అనంత ఆనందమయ స్థితి. ఈ స్థితికి ముందు ఏముంది? అనంత ఆనందమే!!
మీ యదార్ధ స్థితి, అందరం ఒక్కటే నన్న చైతన్యంతో కూడిన స్థితియే జ్ఞానం!
ఇది అనంత శక్తివంతమైంది. అనంత ఆనందమయమైంది.
ఈ స్థితి మానవ మనస్సు నాశనమయ్యాక పొందగల్గుతారు.
ఈ స్థితి పొందాలంటే సద్గురువు పాదాల క్రింద ధూళిగా మారాల్సిందే!
భగవంతుడు ఒక్కడే వున్నాడు. భగవంతుని పాదధూళిగా మారడం ఎలా?
ఇందుకు ఒక్కటే మార్గం ఉంది. విధేయత ఒక్కటే శరణ్యం.
విధేయత వల్లనే భగవంతుని పాదాల చెంత పాద ధూళిగా మారగల అవకాశం లభిస్తుంది. ఇది చాలా కష్టమైన పని. అయినప్పటికీ, ఈ ప్రపంచంలో ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసినవారు, వారి లక్ష్యాన్ని చేరుకున్నవారు, సార్ధకజన్ములు ఎందరో వున్నారని బాబా వివరించారు. నాకు విధేయులుగా వుండాలంటే చాలా కష్టంగా మీరు భావించినట్లయితే, కనీసం బాబా నామం నిరంతరం గుర్తుంచుకునే ప్రయత్నం చేయండి. అదీ కూడా చేతకాదని వాపోతేనో, మీ చివరి క్షణాలలో ప్రాణం నవరంధ్రాల నుండి

ఏ మార్గం గుండానో బయటకు వెళ్ళబోయే ముందు – కనీసం 'మెహెర్‌బాబా' అని నా భగవన్నామం స్మరించండి! ఇలా వారి ఆఖరి క్షణాలలో నా నామం తలచుకున్నవారు చాలామంది వున్నారు. వారందరూ నాలో ఐక్యమయ్యారు.
కొద్ది క్షణాల క్రితం ఆరంగాం గ్రామస్థులు పెద్ద ఊరేగింపుతో, భజన గీతాలు, హారతులు పడుతూ నా దగ్గరకు వచ్చారు. వారెందుకు వచ్చారనుకున్నారు?
ప్రాపంచకంగా వారికి గల చిన్ని కోర్కెలు నెరవేరాలని కోరుతూ వారందరూ వచ్చారు. వెళ్ళిపోయారు. నేను వచ్చింది వారిలాంటివారి కోసం కాదు సుమీ అన్నారు.
ఈ ప్రపంచం మొత్తం నేను చూసుకోవల్సిన బాధ్యత నాపై వున్నా, కొంతమంది ఎంపిక చేసుకున్నవారి కోసమే నేను ఈ అవతార కాలంలో మీ మధ్యకు వచ్చాను. మీ కళ్ళెదుట నేనున్నాను.
నా దివ్యావతారం దర్శించుకునే ప్రయత్నం చేయండి!
బాబాజాన్ నా రెండు కనుబొమ్మల నడుమ ముద్దు పెట్టుకున్నప్పటి నుండీ నాకు అనంత దైవీ ఆనందం లభించింది.
ఆ తర్వాత సుమారు 9 నెలల పాటు తిరిగి
నా సాధారణ మానవ స్థితికి రావడానికి మాటల్లో వర్ణించలేనంత బాధను నేను అనుభవించాను. అలవికాని బాధ అది.
ఆ బాధ నుండి నివారణోపాయంగా ఇంటిలోని
గోడలకు నా తలను గట్టిగా కొట్టుకునేవాడిని. నా తల బ్రద్దలై రెండు చెక్కలయ్యేటంత గట్టిగా గోడలకు తల కొట్టుకునేవాడిని. ఆ బాధ అంత బాధాకరంగా వుండింది. అలాంటి కష్టం – బాధ మరొకటి వుండివుండదు. పంచ సద్గురువులు నన్ను మాయా తెరలో ఈ భూమ్మీదకు తీసుకువచ్చారు. బాబాజాన్ ఆ మాయా తెరను తొలగించింది. నేను ఆ స్థితిలో తొమ్మిది నెలలు వున్నాను. ఆ తర్వాత ఈ స్థూల ప్రపంచపు చైతన్యం లభించింది. ఆ క్షణం నుండి అనంత ఆనందం, అనంత బాధలు రెండింటినీ అనుభవించాను. 'యుగయుగాలుగా నేను అవతరిస్తున్నాను.
నా వయస్సు ఎంతై వుంటుంది? మీరే ఆలోచించండి!
మీరు ఎన్నో సంవత్సరాలుగా జన్మిస్తున్నారు.
నిజానికి ఎవరూ – రారు – పోరు –
మరణించరు – జన్మించరు.
ఇది అనుభవంలోకి రావాలంటే సంస్కారాలు
అన్నీ సమసిపోవాలి. నిర్మూలించబడాలి!"
ఆ సందేశం తర్వాత బాబా మెహెరాబాద్ తిరుగు ప్రయాణమయ్యారు.

**–సశేషం**

# అవతారునికి ఆరతి

గుజరాతీ భాషలో బుఝావో ఆరతిని మెహెర్‌బాబానే స్వయంగా రాసారు.
1920వ దశకంలోనే మెహెర్‌బాబా ఈ ఆరతి రాసారని సమాచారం.
1962లో జహా( కల్పనా ఆరతిని శ్రీ మధుసూదన్ రాసారు.
అదిసచేతన ఆరతిని శ్రీ భావూ కల్చూరీ రాసారన్న సంగతి పాఠకులకు తెలుసు.
ఇవికాక తెలుగువారు ఎక్కువగా
శ్రీ బాలగోపాల భాస్కరరాజు గారు రాసిన
దేవాదిదేవ ప్రభో!! ఆరతిని,
శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి గారు రాసిన మెహెర మనోహర
ఆరతులను ఎక్కువగా ఆలాపిస్తుంటారు.
సుమారు ఒక దశాబ్దం క్రితం నాటి మాట.
ఈ విషయానికి మేం ప్రత్యక్ష సాక్షులం కూడా.
ఇంతకీ అదేమంటే, తెలుగులో ఆరతి ఇంతవరకూ లేదు కాబట్టి
తెలుగులో ఆరతి నొకదాన్ని రాసి, కూడబలుక్కుని వచ్చినట్లు శ్రీ బాలగోపాల
భాస్కరరాజు, శ్రీ మంత్రవాది శ్రీరామూర్తి ఇద్దరూ
ఆ ఏడాది అమరతిధి వేదికపై నుండి ట్రస్టు చైర్మన్ భావూజీ ఎదుట ఆలాపించారు.
ఆ రెంటిలో ఏదోనొకదాన్ని ఆమోదించమన్నప్పుడు
భావూ తన సహజ ధోరణిలో ఎదుటనే వున్న బాబా సమాధికేసి చూస్తూ,
దేవాదిదేవని బాబా అంగీకరిస్తున్నాడన్నారు.
ఇది ఆనాటి మాట.
నేటికీ గుర్తుంచుకోవల్సిందే!!
ఐతే, ఒక్క క్షణం.
బాబావారు రాసిన బుజావే ఆరతి,
భావూజీ రాసిన ఆదిస చేతన ఆరతులు
గుజరాతీ, హిందీ భాషలలో ఉన్నాయి.
తెలుగువారు చాలాకాలంగా ఆయా ఆరతులను తెలుగులో ముద్రించి,
తెలుగులో దాని అర్థం కూడా ప్రచురించాలని కోరుతున్నారు.
పత్రికలో స్థలాభావం వల్ల ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు వాయిదా వేయవల్సివచ్చింది.
నేడు ఈ సంచికలో పాఠకుల కోరిక మన్నించి అవతారుని ఆరతులు అందజేస్తున్నాం.
దయచేసి పరిశీలించండి.

# హిందీ హారతి - అది సచేతన

అది సచేతన, శాంతి నికేతన,
నమో బ్రహ్మ అవో
**మెహెర్‌ప్రభు ఆరతి అపనావో॥**

ప్రేమ - దీపమై హియె జలాఊ
అపనా సబ్ కుచ్ తుమ్‌హే చఢాఊ
తుమ ముఝుకో సరసావో
**మెహెర్‌ప్రభు ఆరతి అపనావో॥**

జీవనకీ హర్ సాస్ హమారీ
బన్ జాయె ప్రభు, గతీ తుమ్‌హరీ
హే కరుణాకర లీలాధారీ
తుమ్ కరుణా బరసావో
**మెహెర్‌ప్రభు, ఆరతి అపనావో॥**

బనె ఆరతీ జీవన మేరా,
ఆది - అంతకా లయ హోఘేరా
ఖులె నయన ఔర్, దిఖె సవేరా
తుమ్ ముఝుమే ఛ జావో
**మెహెర్‌ప్రభు, ఆరతీ అపనావో॥**

**- భావూ కల్చూరీ**

# మల్కాజిగిరి బాబా సెంటర్ నూతన కార్యవర్గం

మల్కాజిగిరి బాబా సెంటర్‌లో 2014-15కు గాను నూతన కార్యవర్గం గౌ॥ అధ్యక్షులు: శ్రీ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు: శ్రీ వి.ఆర్.కె. శాస్త్రి, కార్యదర్శి: శ్రీ పి.పి. హరి, సహాయ కార్యదర్శి: శ్రీ యం. రాఘవ, కోశాధికారి: శ్రీ జగన్నాథం మరియు కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆది సచేతనకు - తెలుగు సేత

ఎవరి ప్రేమ వల్ల ఈ యావత్తు సృష్టి ఏర్పడిందో-
అలాంటివాని దైశాంశ శక్తిని ఎవరయినా ఎలా కొలవగల్గుతారు?

ప్రాణ ప్రధాతవు, శాంతి మూర్తివి, నీకు వందనాలు -
ఓ సృష్టికర్తా! నీకు స్వాగతం,
**ఓ మెహెర్‌ప్రభూ, నేను ఇచ్చే ఆరతి స్వీకరించు.**

నా హృదయంలో ప్రేమ అనే దీపాన్ని వెలిగించు,
నాలో నిగూఢమై ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి,
నా సర్వస్వం నీకు అర్పించి,
నీ ప్రేమ లభించేలా అనుగ్రహించు,
**ఓ మెహెర్‌ప్రభూ - నేను ఇచ్చే ఆరతి స్వీకరించు.**

నా జీవితంలోని ప్రతి క్షణం నీ ఇచ్ఛ ప్రకారం
నేను నడుచుకునేలా చూడు,
హే కరుణామయమూర్తి, లీలా ధారి
నీ కరుణా కటాక్ష వీక్షణాలు నాపై ప్రసరింప జేయి
**ఓ మెహెర్‌ప్రభూ నేను ఇచ్చే ఆరతి స్వీకరించు.**

నా జీవితమే నీ ఆరతిగా మార్చి,
జనన, మరణ చక్రాన్ని ఎప్పటికీ అంతంచేయి ప్రభూ!
నూతన ఉషస్సు కాంతులు చూడటానికి నా కళ్ళు తెరిపించి,
నాలో నీవు పూర్తిగా నిండిపో ప్రభూ
**ఓ మెహెర్ ప్రభూ నేను ఇచ్చే ఆరతి స్వీకరించు.**

**- యం. శారద**

# గుజరాతీ ఆరతి

**– మెహెర్‌బాబా**

బుర్ఘూవే నార జహల్లతనీ,
ఎ కర కుద రతనె ఫరమాతు ।
ఛె లాగీ ఆస భక్తోనే,
కె బఖ్‌శే నూరే యిమాతు ॥

ఆయా మురశ్‌ద్ మెహెర్ బాబా,
చరణపర్ తుజనా ధరీఎ సర్ ।
ఖుదానా జాత థీ వా ఖేఫ్,
థయీా బేతో మెహెర్ బాతు ॥

తు ఛే మాలిక్ హాకీకతనో,
తు అశిక్‌భ నె అరెఫ్ భీ ।
తు ఛె దరియాఎ వహెదత్
మారెఫతనో హోయీా తూఫా తు ॥

హమో రహె రవనె ఆఎ సాలెక్,
బఖ్‌శజె జ్ఞాన యీాజదను ।
కె తూ పరమాత్మా జ్ఞానీ ఛె,
నె ముఖ్తారే యిరఫా తు ॥

ఖుదానా ప్రేమనో ప్యాలో,
పిలావే మస్త హమనేకర్ ।
ఛె తుజ్‌పర్ జాన్ సదకె,
సాకీయా ఆపిఎ పయమా తు ॥

హమారీ నావ భర దరిఎ, తరావెతో హమే తరిఎ ।
హమారా నాఖుదా అయ్ మెహెర్, బాబా ఛె నిగేబాతు ॥
బుర్ఘూవే నార జహల్లతనీ, ఎ కర కుదరతనె ఫరమాతు ॥
ఛె లాగీ ఆస భక్తోనే, కె బఖ్‌శే నూరే యిమా తు ॥

# బుర్ఖావే ఆరతి - తెలుగు అనువాదం

ఓ భగవంతుడా! మాలో ఉన్న అజ్ఞానమనే అగ్నిని
ఆర్పివేయమని ఆజ్ఞాపించు
నీ ప్రేమికులు వారిలో విశ్వాసమనే జ్యోతిని వెలిగించమని ప్రాధేయపడుతున్నారు.
ఓ మెహెరుబాబా!
మా శిరస్సులను (తలలను) నీ పాదాలపై ఉంచాము.

ఓ మెహెరుబాబా! నిన్ను నీవు భగవత్ స్వరూపునిగా తెలుసుకున్నావు
నీవు సత్య స్వరూపుడవు, ప్రేమికుడవు,
ప్రియతముడవు, అన్నీ నీవే
అనంతజ్ఞాన సంపన్నుడవైన నీవు అనంత సాగరానివి
ఓ భగవంతుడా! బాటసారులమైన మాపై కరుణ చూపించి నీవే 'ఈజద్' ఏకైక
పూజ్యుడవనే జ్ఞానం కలుగజేయి.

ఎందుకంటే ఓ పరమాత్మా!
నీవే సర్వవ్యాప్తివి, దివ్యజ్ఞాన సంపన్నుడివి
మమ్మల్ని మస్తులను చేసి, మత్తులో మునిగేలాగున
మాచే భవత్ప్రేమయనే పానీయాన్ని తాగించు

ఓ సాకీ, మా జీవితాలను నీ కోసం త్యాగం చేస్తాం
నీవు మాకు ఆ పానీయాన్ని ప్రసాదించు
నడి సముద్రంలో ఉన్న మా జీవిత నౌక
నీవు నడిపితేనే తేలియాడుతుంది.
ఓ మెహెరుబాబా! నీవే మా నౌకను దరిచేర్చగల సరంగువి,
నీవే మా రక్షకుడివి.
ఓ మెహెరుబాబా! నీవే మా నౌకకు సరంగువి
నీవే మా రక్షకుడివి.

**- యం. శారద**

# విద్యార్థులకు సందేశం

**("లార్డ్ మెహెర్" నుండి 15వ సంపుటి 5159 పేజీ)**

నేటి యువత రేపటి నేత,
ప్రతి విషయానికి చిన్న మొదలు ఉంటుంది.
చిన్న విత్తనమే చెట్టుగా పరిణతి చెందుతుంది.
చిన్నవాగు నదిగా, చిన్ని బిడ్డ – మనిషిగా పెరుగుతారు.
వారు జీవితంలో తాము నేర్చుకున్న పాఠాలను యువకులై వినియోగించగలిగి,
వినియోగించలేక పోతారు. కానీ వారు మనిషిగా పెరిగిన తర్వాత కూడా
ఆధ్యాత్మిక విషయంలో అంతడింకా పసివాడిగానే ఉండిపోతారు.
ప్రపంచమనే చిన్న బడి నుండి పెరిగిన అతనికి ఆధ్యాత్మిక విషయాలను
బోధించడానికి ఒక స్కూలు కావాలి.
మనిషి అనేక జన్మల నుండి బాధ – సంతోషము, ఆనందము – విచారము,
మంచి – చెడు, సంపద – బీదరికము అనే ద్వంద్వ భావాలనే అనుభవాల
నుండి పాఠాలు నేర్చుకుంటాడు.
మనిషి తన నిజమైన ఆత్మ స్వరూపాన్ని కనుగొనుటకు
సాగే ఎదుగుదల చాలా నెమ్మదిగా సాగుతుంది.
నిస్వార్ధ సేవ, ప్రేమల ద్వారా పిల్ల చేష్టలైన ద్వేషము, దురాశ, కోపము
నుండి విముక్తి పొందుతాడు.
ఆధ్యాత్మిక అధ్యయనంలో ధైర్యము, మనోనిశ్చయము కలవారు
మాత్రమే అనేక స్థాయిలను దాటి జయము పొందగలరు.
చదువు సంధ్యలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలా దారి చూపుతారో,
అలాగే ఇక్కడ కూడా సద్గురువు ఆధ్యాత్మిక మార్గంలో అరుదైన భగవత్తత్వానికి
దారిచూపుతారు. కొంత మందికి మాత్రమే అభాగ్యం కలుగుతుంది.
దాని కొరకు మీరు ఆ సద్గురువు కృపకు పాత్రులవ్వాలి.
ఆయన ప్రేమను పొందుటకు అర్హతను సంపాదించాలి.
కావున మీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చే క్రమశిక్షణను తిరస్కరించకండి.
ప్రాథమిక క్రమశిక్షణ ఆత్మశోధనకు కావలసిన క్రమశిక్షణకు దారి చూపిస్తుంది.
ఇతరులను జయించడం కంటే మిమ్ములను మీరు జయించినట్లయితే
ప్రపంచాన్ని జయించిన వారవుతారు.
దానికి సులభతరమైన మార్గము దేముని ప్రేమించుటయే.
మీతోటి వారిని ప్రేమించుట ద్వారా భగవంతుణ్ని ప్రేమించడం మొదలుపెట్టండి.

ప్రతి జీవిలోను, వస్తువులోనూ ఉన్న భగవంతుడ్ని చూడడం మొదలుపెట్టండి.
ప్రతిఫలాన్ని ఆశించకుండా దానం చెయ్యండి.
కీర్తిని ఆశించకుండా సేవచెయ్యండి.
భగవంతుడు అన్నింటిలోను, అంతటను నిండి ఉన్నాడు.
అన్నింటి కన్న ఆయన నీలోనే ఉన్నాడు.
ప్రపంచం కొరకు మీరు లేరు. మీ కొరకు ప్రపంచం ఉంది.
ఈ విషయం మనకు ఒక చక్కని చీమ కథ ద్వారా బహిర్గతమవుతుంది.
ఒక చీమ ఆకుపై తేలియాడుతూ ఒక చిన్న వాగును దాట ప్రయత్నించింది.
మధ్యలో గాలి వలన ఆ ఆకు తిరగబడింది.
అప్పుడు ఆ చీమ "సాయం చెయ్యండి.
యీ ప్రపంచం అంతా మునిగి పోతోంది॥ అని అరవసాగింది.
అది విని ఒక కప్ప "ఏమిటీ...? నువ్వు మునిగి పోతున్నావు కాని
యీ ప్రపంచం కాదు॥ అంది.
అందుకు చీమ – "సరే అనుకో!
నేను మునిగిపోయిన తర్వాత ప్రపంచంతో నాకు సంబంధం లేదు.
కాబట్టి నా వరకు నేను మునిగిపోతే నాతో ప్రపంచం కూడా మునిగినట్లే" అంది.
అలాగే మొత్తం ఉనికి అంతా నీలోనే ఉంది.
నీలో ఉన్న భగవంతుణ్ణి కనుగొనాలి.
దేముడిని కనుగొనడం అనేది నిజమైన కనుక్కోదగినట్టి సంపద.
నేను మిమ్ములను ఆశీర్వదిస్తున్నాను. భగవంతుడిని ప్రేమించండి.
తద్వారా ఆయనను తెలుసుకోండి.

**తెలుగు సేత: శ్రీమతి ఎస్.ఎస్. లక్ష్మి**

# విజయనగరం బాబా సెంటర్ నూతన కార్యవర్గం

విజయనగరం బాబా సెంటర్‌లో 2014-15కు గాను నూతన కార్యవర్గం గౌ॥ అధ్యక్షులు: శ్రీ చాగంటి అఘోరపతి, అధ్యక్షులుగా శ్రీ సి.హెచ్. చింతామణి, ఉపాధ్యక్షులు: యస్.ఎన్.యం. రాజు, కార్యదర్శి: పి. రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శి: పి. త్రినాథ్, కోశాధికారి: పి. ప్రసాద్ మరియు ఇతర 11 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

కొంత దూరం వెళ్ళాక బస్సుని ఆపమన్నారు బాబావారు. డ్రైవరుతో మాట్లాడటానికి వీలుగా బాబావారి క్యాబిన్‌కి ఓ కిటికీ వుంది. మరీ అంత పెద్దదీ కాదు అంత చిన్నదీ కాదు. బాబావారు ఎప్పుడైనా పాద్రీకి ఏదైన సంజ్ఞ చేయాలంటే, ఈ కిటికీ తెరిచేవారు. ఈవాళ అదే చేశారు. అప్పటికే బస్సు జీలం వంతెనపైకి వచ్చింది. పాద్రీ బస్సును ఆపాడు. బాబావారు బస్సు దిగారు. కోటు తీసేశారు. చుట్టూరా కొండలు, లోయల మధ్య ప్రశాంతంగా ప్రవహిస్తున్న జీలం నది ఎంతో బాగుంది ఈ దృశ్యం అన్నారు. ఇక్కడ అణువు అణువునీ ఆధ్యాత్మికత వుట్టిపడుతోంది అన్నారు. ఆధ్యాత్మిక రంగంలోకి రారమ్మని పిలుస్తోందీ ప్రాతం అన్నారు. కాశ్మీర్‌లో ఏకాంతవాసానికి అనువైన చోటు దొరక్కపోతే ఇక్కడికే తిరిగి వస్తాను. ఇక్కడే ఓ పర్ణశాల కట్టుకొని వుంటాను అన్నారు. మరి మండలివారో? వాళ్ళు ఈ లోయ దిగువన వుండవచ్చన్నారు. నది ఒడ్డుకు వెళ్ళారు. దోసిలిలో నీళ్ళు తీసుకొన్నారు. నోటిలో పోసుకున్నారు. అలా రెండు మూడుసార్ల చేశారు. యూరీ చేరేసరికి గోధూళి వేళ అవుతోంది. జీలం నది ఒడ్డున వున్న ఈ వూరు కప్పు ఆకారంలో కన్పిస్తుంది. చుట్టూరా ఎత్తయిన కొండలు.

ప్రకృతి అందాలకి మారుపేరయిన కాశ్మీర్‌లోయకి సింహద్వారం యూరీ అనాలి. అప్పట్లో సరైన రోడ్డు లేదు. ఇక్కడి నుంచి శ్రీనగర్ అరవై ఆరు మైళ్ళు.

పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ రాజధాని ముజఫరాబాద్‌కీ, శ్రీనగర్‌కీ సమ దూరంలో వుంది యూరి. కాశ్మీర్ నియంత్రణ రేఖ ఇక్కడికి సుమారు పది పన్నెండు మైళ్ళు. యూరీ ప్రత్యేకత ఏమిటి? సూఫీలకి పెట్టింది పేరు యూరీ ప్రాంతం. బాబా ఫరీద్, బాబా కజినాగ్, బాబా గఫూర్ సాహెబ్ ఇక్కడి ఇలవేల్పులు. సిక్కుల ఆరవ గురువు హరగోవింద్ సింగ్ పేరిట కట్టిన గురుద్వారా ఇక్కడి మరో ఆకర్షణ. వానాకాలంలో పాండవులు యూరీ కొండ గుహల్లో వున్నారని స్థల పురాణం చెప్తోంది. ఇది నిజం, అబద్ధం కాదు అంటున్నట్లు పాండు మందిరం ఇప్పటికీ దర్శనమిస్తోంది.

ఈ అద్భుత ప్రదేశానికి 1992లో నేను వెళ్ళాను. బాబావారు సందర్శించిన ప్రాంతం యూరీ అని తెలియని రోజుల్లో జరిగింది నా యాత్ర. ఆకాశవాణి విలేఖరిని కావటంతో

వార్తల కోసం వెళ్ళానక్కడికి శ్రీనగర్ నుంచి హెలికాప్టర్‌లో. పాక్ ఆక్రమిత కాశ్మీర్ రాజధాని నుంచి ఉద్యమకారులు వస్తున్నారు యూరీకి అన్న కబురు నా యాత్రకి ప్రేరణ. ఆకాశంలో ఎగురుతూ ఆ కొండలకేసి చూస్తుంటే "అమ్మో, ఎంత కష్టమో కారులో, బస్సులో ప్రయాణం చేయటం ఈ ప్రాంతంలో", అనిపించింది.

బాబావారి బస్సు యాత్ర – జగన్నాథుని రథయాత్ర. అయినా పాపం పాద్రీ ఎంత కష్టపడ్డారో బస్సు నడపడానికి. ఊహించలేము కదూ. ఇహ మళ్ళీ మెహెరీయంలోకి వస్తే, జూలై నెల అయినా చలి బాగా వుంది. అయినా బాబావారు కోటు వేసుకోలేదు రోజల్లా ఆవాళ. ఆరాత్రికి బస డాక్ బంగళాలో. మెహెరాబాద్ నుంచి బయలుదేరాక, ఎక్కడా బాబావారు తమ పేరుని చెప్పనీలేదు ఎవరికీ. కానీ యూరీలో తమ పేరుని చెప్పనిచ్చారు. అది ఏదో ఒకసారీ రెండుసార్లు కాదు శాశ్వతంగా అందరికీ గుర్తుండిపోయేలాగ. ఇది ఎలా జరిగిందంటే... డాక్ బంగళాలో ఎవరు బస చేసినా రిజిష్టరులో పేరు, ఎక్కడి నుంచి వచ్చిందీ, యిత్యాది వివరాలు వ్రాయాలి. ఇంతవరకూ ఏ హోటల్లోనూ, ఏ డాక్ బంగళా దగ్గరా బాబావారి పేరుని బయటపెట్టలేదు. మరి ఇక్కడ యూరీ బంగళా రిజిష్టరులో మెహెర్‌బాబావారి పేరు, వివరాలు స్పష్టంగా వ్రాశారు. ఇది స్థల మహత్యం కావచ్చు. ఏదో ఓ కళ్యాణార్ధం కావచ్చు. ఇదమిద్ధంగా తెలీదు ఎవరికీ. మెహెర్ ప్రభు చరిత్రలో యూరీ స్థానం పదిలమయిందన్న మాట మాత్రం స్పష్టం, సుస్పష్టం. ఇందుకనేనేమో పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌కీ మన జమ్ముకాశ్మీర్‌కీ మధ్య యూరీ నియంత్రణ రేఖ ప్రక్కనే వెలసింది.

జూలై 30వ తేదీ ఉదయం ఏడున్నర గంటలకి బస్సు మళ్ళీ కదిలింది. ఈసారి గమ్యం శ్రీనగర్. కొంచెం దూరం వెళ్ళిందో లేదో, బాబావారు బస్సుని వెనక్కి తిప్పమన్నారు. పాద్రీ చెప్పినట్లే చేశాడు. యూరీలోకి మళ్ళీ అడుగుపెట్టాక, బాబావారు ఓ అంధ బాలుడిని చూశారు. పెద్ద రుమాలు ఇచ్చారతనికి బహుమతిగా. ఆ కుర్రాడి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. తాను ఎదురుచూస్తున్న ప్రభువే స్వయంగా తన దగ్గరకి రావటం జేబురుమాలని బహూకరించడం ఎంత అదృష్టమని. ఇంతకీ ఆ కుర్రాడు ఏమీ సామన్యుడు కాదు. యూరీ వాసులు అతన్ని ఆరాధిస్తారు. వాళ్ళ దృష్టిలో అతను కుర్రాడుకాదు. ఓ గొప్ప ఋషి. అలా ఆ బాల ఋషికి దివ్యానుభూతిని ప్రసాదించి, బాబావారు బస్సు ఎక్కారు. పన్నెండు గంటల ఇరవై నిముషాలకి శ్రీనగర్‌లో దిగారు. భూతల స్వరంగా చెప్పుకునే శ్రీనగర్‌లో ప్రత్యేక ఆకర్షణ డాల్ సరస్సు. ఆ సరస్సులోనే చాలామంది వుంటారు పడవలపైన. ఇవి గూడు పడవలు. పేరుకి పడవలైనా వుండటానికి అవసరమైన సదుపాయాలన్నీ వుంటాయి వాటిల్లో. ఓ పడవలో బాబావారి బస ఏర్పాటైంది. ఆ పడవ సరంగు కొడుకు పేరు సుల్తాను. నాల్గేళ్ళవాడు. వాడికి కలలో ప్రభువు కనిపించాడు. "రేపు వస్తున్నా మీ ఊరు. నేను

దేవుడిని" అని చెప్పారట. ప్రొద్దుటే అమ్మకి తన కల చెప్పాడు.
ఆ తల్లికి పిల్లాడి మాట అర్థంకాలేదు. ఏమంటున్నాడో వీడు అనుకొంది.
"సరేలేరా, అలానే రానీ" అంది. ఇంతలో డాల్ సరస్సువైపు వస్తున్నారు బాబావారు.
"ఇదిగో అమ్మా! ఈయనే నాకు కనిపించింది రాత్రి కల్లో అన్నాడు సుల్తాన్.
తల్లీ, కొడుకూ బాబావారికి అభివాదం చేశారు. తమ పడవని పావనం చేయమని ప్రార్థించారు. భక్తుల కోర్కెని ప్రభువు ఎప్పుడైనా త్రోసిపుచ్చారా?
ఈవాళ శ్రీనగర్‌లోను అంతే. తల్లీ బిడ్డలను అనుగ్రహించారు.
వాళ్ళ గూడు పడవలో బసచేశారు. మండలివారు ఇంకో దగ్గరి పడవలో దిగారు.
బాబావారి రాక అందరికీ తెలిసింది. పడవ సరంగులు బాబావారిని దర్శించారు.
మా పడవలకి కూడా రండి ప్రభు! మా జన్మ ధన్యం చేయండి అని ప్రార్థించారు.
సరేనన్నారు బాబా. చాలా పడవలకి వెళ్ళారు. వాళ్ళ నాయకుడు
కరీమ్ పడవలో కాస్సేపు కూర్చొన్నారు కూడా. ఆ రాత్రి సరంగులు పడవ యజమానులు, మళ్ళా బాబావారి దగ్గరకి వాచ్చారు. ఆయన సమక్షంలో చాలాసేపు కూర్చొన్నారు. కాశ్మీరీ భక్తి పాటలు పాడారు. పురి విప్పిన నెమలిలా సుల్తాన్ నాట్యం చేశాడు. చిన్నారిని బాబావారు ముద్దాడారు. మర్నాడు జూలై 31వ తేదీ ఉదయం, బాబావారు, మండలివారున్న పడవకి వెళ్ళారు. బ్రేక్‌ఫాస్ట్ టైమ్ అయింది. అయినా బ్రేక్‌ఫాస్ట్ రడీ కాలేదు. బాబావారికి కోపం వచ్చింది. మండలివారు ఖిన్నులయ్యారు. బ్రేక్‌ఫాస్ట్ చేయమని మాకు చెప్పలేదు కదా అన్నారు. బాబావారు తీవ్రంగా స్పందించారు. మీ భుజం తట్టి శహభాష్ చెప్తాననుకోవద్దు ఎప్పుడూ అన్నారు. లాలించి బుజ్జగిస్తాననీ ఎదురు చూడవద్దు అని స్పష్టం చేశారు. ఒడిదుడుకులు ఎదుర్కోవడం నేర్చుకోమన్నారు. లేకపోతే మీ పని దండగ అన్నారు. ఇప్పుడు ప్రవర్తించినట్లు అంటే బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేయమని నేను చెప్పలేదని అన్నారే అలా అంటూ పోతే నాతో వుండటం దండగ. శుష్కదండగ. ఇదిగో నేను ఏకాంతవాసంలోకి వెళ్ళేవరకు ఈ కష్టాలు భరించండి. ఆ తర్వాత మీ ఇష్టం. ఆనందం, పరమానందం అనుకొంటూ ఎలా వుండాలను కొంటే అలా వుండవచ్చు. మీ ఇష్టం అన్నారు. నషాళానికి అంటే మాట శెలవిచ్చారు. తమని సేవించాలనుకొంటే సేవించమన్నారు. రోజుకి వెయ్యిసార్లు దర్శనం చేసుకోమన్నారు. రేపు ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు అంటూ మాటమార్చారు. కాశ్మీరు ప్రత్యేకత వివరించారు. భగవత్‌శక్తి, మాయ ప్రభావం సమతూకంలో వున్నాయి కాశ్మీర్‌లో అన్నారు. భగవంతుడు వున్నచోట ఏమి జరిగినా హాని కలగదు.
కానీ అదే మాయ వున్నచోట, మాయ ప్రభావంలో చేసే ప్రతిచర్య వల్ల బంధనాలు పెరుగుతాయి అన్నారు. అందుకనే కాశ్మీరులోలాగా దైవీశక్తి, మాయా ప్రభంజనం సమతూకంలో వుండటం శ్రేయస్కరం అన్నారు. మండలివారికి అర్థమయిందో లేదో

అనుకొన్నారేమో ఓ ఉదాహరణ చెప్పారు. రెండు నదులని తీసుకోండి. ఏ నదికి ఆ నది ప్రవహిస్తుంటే, ఎలా వుంటాయి స్వేచ్ఛగా సాఫీగా పరుగులు తీస్తూ కన్పిస్తాయి. మరి ఆ రెండు నదులు కలిస్తే, ఆ సంగమం ఎలా వుంటుంది? అన్నారు. వాళ్ళ స్వేచ్ఛకి సంకెళ్ళు వేసినట్లు వుండదూ అన్నారు. నిజమే సుమా అనుకొన్నారు మండలివారు. బాబావారు మరో మాట శెలవిచ్చారు. మండలివారెంత అదృష్టవంతులో చెప్పకనే చెప్పారు. కాశ్మీరు మహారాజ్ ఎన్నో చట్టాలు చేశాడు. మంచీ చెడూ నిర్దేశించాడు. రాజు గారి ఆదేశాలని ప్రజలు శిరసావహించాలి. రాజాజ్ఞని ధిక్కరించే సాహసం చేయలేరు ఎవరూ? ఎందుకని? రాజుగారు ఏది చేసినా ప్రజాహితం కోసమే చేస్తారు కదా. మరి రాజుగారి బంధుమిత్రులులకి ఈ చట్టాలు వర్తించవు. అంటే వాళ్ళకి ఏ బంధనాలు లేవు. స్వేచ్ఛగా, హాయిగా వుండవచ్చు. అదొక వరం. రాజుగారి అంతరంగికులకి. మీరూ నాకు ఆంతరంగికులే కదా. నాతో వుంటున్నారు కాబట్టి మీకు బోల్డంత స్వేచ్ఛ లభిస్తోందన్నారు. తమ ఏకాంతవాసానికి తగిన జాగా వెదికి రమ్మని బువాసాహెబ్‌కి పని పురమాయించారు. ఇంతలో నోట్లో ఏదో వేసుకొంటూ విష్ణు, రావ్ సాహెబ్ కనిపించారు. కోపం వచ్చింది. నా అనుమతి తీసుకోనక్కర్లేదా అని గర్జించారు. చాచి లెంపకాయ కొట్టారు ఇద్దర్నీ. బిత్తరపోయారు వాళ్ళు. తల దించుకొని నిలబడ్డారు. బాబావారికి కోపం ఎక్కువసేపు వుండదు కదా. ఈవాళ అంతే. అందుకనే వాతావరణం తేలికపడింది. సరే రండి అందరం బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం అన్నారు. చెట్టు క్రింద కూర్చొన్నారు. బ్రేక్‌ఫాస్ట్ చేశారు. వేడివేడి టీ త్రాగారు. బూవాసాహెబ్ రెండు చోట్లకి వెళ్ళివచ్చాడు. ఇస్లామాబాద్, అక్చిబల్ అన్న ఆ రెండు జాగాలని అందరూ చూశారు. బాబావారికి ఓ చోటు నచ్చింది. ఇక్కడ ఏకాంతవాసానికి బాగుంటుంది అన్నారు. అయితే అక్కడ వుండటానికి అనుమతి కావాలి. స్థానిక అధికారుల, పెద్దల అనుమతి దొరకలేదు. పహాడీ మార్తాండ్ (అంటే మార్తాండ్ కొండ)కి వెళ్ళారు. ఆ కొండపై ఓ గుహ కనిపించింది. బాబావారికి నచ్చింది. ఇక్కడే మా ఏకాంతవాసం అన్నారు బాబా. అందరూ కొండ దిగారు. ఓ చిన్న వాగు కనిపించింది. కాసేపు ఆగారు అక్కడ. బాబావారు దోసిలితో నీళ్ళు తీసుకొని అందరికీ ఇచ్చారు. అలనాడు వెన్న ముద్దలు తిని, తినిపించిన పరంధాముడు ఇలనాడు జలజలా పారుతున్న జలామృతాన్ని మండలివారి నోటిలో పోశారు. ఆఘూ, అక్బరు ఆలీలకీ ఆ అదృష్టం ఇచ్చారు. ఏకాంతవాసానికి అనువైన చోటు కోసం, ఆగస్టు ఒకటవ తేదీన మరికొన్ని ప్రాంతాలకి వెళ్ళారు. మన్సబల్ అన్నచోట ఓ గుహ కనిపించింది. అది బాబావారికి నచ్చలేదు. డాల్ సరస్సు దగ్గర రెండు జాగాలు చూశారు. నిషల్, షాలీమార్ చూడటానికి బాగున్నాయి. చుట్టూరా కొండలు, కొండల మధ్య కోన, రకరకాల పూల చెట్లు, నందనోధ్యానంలా ఉన్నాయి. కానీ అవికూడా బాబావారికి

నచ్చలేదు. శ్రీనగర్ చుట్టుప్రక్కల ఎక్కడైనా వెదికితే? ఈ ఆలోచన నచ్చింది. 12 మైళ్ళ దూరంలో హర్వాన్ అని ఓ కుగ్రామం ఉంది. ఆ జాగా బాబావారు ఇష్టపడతారేమో? ఏమో ఎవరికి తెలుసు ప్రభువు మనస్సు.

అందుకనే అందరూ హర్వాన్ వెళ్ళారు. ఊరు చూడముచ్చటగా వుంది. ఏమాటకి ఆ మాట చెప్పాలి. ఈ ఊరుని కొట్టేయటానికి లేదు. చుట్టూరా కొండలు, ఆ కొండల మధ్య ఎటుచూసినా పచ్చిక బయళ్ళు. ఆ హరిత ప్రాంతం ఎంత బాగుందో మాటల్లో చెప్పలేము. ఇదిగో ఈ జాగా బాబావారికి సరిపోతుందని ఓ జాగా చూపించారు స్థానికులు. బాబావారు పెదవి విరిచారు. బాగాలేదు అన్నారు. పదండి పోదాం అన్నారు. అంతే అందరూ శ్రీనగర్ దారి పట్టారు. ఈ కథకి తెరపడింది అనుకోకండి. హర్వాన్ స్థలం యజమాని బాబావారు వచ్చారని విన్నాడు. బాబావారి యిచ్ఛ తెలిసింది. ఎంతో దూరం నుంచి వచ్చిన మహాత్ముడు మెహెర్‌బాబా. అంతటి మహాత్ముడుని సేవించే భాగ్యం అందరికీ దొరకదు. నేనీ అవకాశాన్ని వదులుకోకూడదు అనుకొన్నాడు. వెంటనే బాబావారి దర్శనానికి వచ్చాడు. నా అభ్యర్ధన మన్నించండి ప్రభు! మీకు సేవచేసే భాగ్యం ప్రసాదించండి దేవదేవా అని ప్రార్ధించాడు. బాబావారు అతని మాటని త్రోసి పుచ్చలేదు. అతని కొండ వుంది కదా, ఆ కొండపై తమ కోసం పాక వేయించమన్నారు. సరేనన్నాడతను. అలా ఆ ప్రకారంగా నవయుగాభిరాముడిని కాశ్మీర్‌లో ఏకాంతవాసానికి శ్రీకారం జరిగింది. హర్వాన్ కొండ దిగువున రెండు చిన్న ఇళ్ళను అద్దెకి తీసుకొన్నారు. ఒక ఇల్లు మండలివారి కోసమట. రెండవ ఇల్లు ప్రేమమూర్తీభవించిన ఆలీ ద్వయానికి. హర్వాన్‌లో బాబావారు అందరికీ దూరంగా, ఎవరికీ దర్శనం ఇవ్వకుండా ఏకాంతవాసం చేయగలుగుతారా? స్థానికులు బాబావారి దర్శనానికి రాకుండా వుంటారా? ఇవి ధర్మసందేహాలు. వాటిని కేవలం ప్రభు ఒక్కరే చేయగలరు. బాబావారెమన్నారో తెలుసా? హర్వాన్ కొండ చుట్టూరా పచ్చిక బయళ్ళు బ్రహ్మాండంగా వున్నాయన్నారు. కొండపై కట్టిన పర్ణశాల బాగుందన్నారు. అయితే ఓ చిక్కు వుందన్నారు. ఏమిటని అడిగారు మండలి. నేనిక్కడ వున్నానని తెలిస్తే హర్వాన్ ప్రజ నన్ను వదిలిపెడ్తుందా! ప్రొద్దున్నుంచి రాత్రి వరకు తండోపతండాలుగా నా మందిరానికి తరలి వస్తుంది. వాళ్ళ రాకతో ఏమవుతుంది. నా పనికి అడ్డంకి ఏర్పడుతుంది. నాపని సాఫీగా జరగదు. బాబావారి దగ్గరకు వెళ్ళకపోతే ఎట్లా అనుకొంటూ కొండ ఎక్కుతారు వాళ్ళు. అదొక తీర్ధయాత్ర. నా కుటీరం ముందు నిలబడతారు. ఇహ నాపని, నా విశ్వ కార్యక్రమం ఏమయ్యేట్లు? అసలు ఆ సంగతి వాళ్ళకి తెలియనే తెలీదుకదా అన్నారు బాబా. నిజమే కదా అనిపించింది మండలివారికి. ప్రభువుని దర్శించి తరించాలన్న తపనే తప్ప తమ రాకతో ప్రభువు ఏకాంతానికి భంగం కల్గుతోందని తెలుసుకోలేరు ఈ అమాయక జనం అని మండలివారనుకొన్నారు.

నాసిక్ నుంచి తెలిగ్రామ్ వచ్చింది. రుస్తుం పంపాడు. ఖైఖుస్రూ బాబాయిని (పిన్ని భర్త) ఎత్తుకుపోయారట. ఆ ఎత్తుకు వెళ్ళిందీ ఎవరో కాదు. దగ్గరి బంధువులేనట. నాసిక్ నుంచి బొంబాయికి తీసుకువెళ్ళి ఎక్కడో దాచివేసేరుట. జోరాష్ట్రియన్లలో పిన్ని భర్తని మాసా అంటారు. అయ్యో! ఎంత దారుణం అని మండలివారు కంగారుపడ్డారు. ఇప్పుడేమి చేయాలి. మాసాని రక్షించేదెవరు? అని కొట్టుకుపోయారు.
భయపడకండి అని అభయం పలికారు మెహెరుడు. హాని జరగదు. నేనున్నానుగా అన్నారు. హమ్మయ్య! అవును దేవదేవుడే చెంత వుంటే, చింతలు దేనికి మనకు అని ఊపిరితీసుకున్నారు మండలివారు. అలా అనుకోవటంలో మండలివారు బాబావారి దైవీ శక్తిని తక్కువగా అంచనా వేశారని కాదు.
బాబావారే సంగతి మరచిపోయారని కాదు.
అదొక అమాయకత్వం అంతే. బాబావారిని మనసావాచా నమ్మకపోతే వారంతా బాబావారి వెంట కదిలేవారు కాదు కదా. మండలివారి మనోగతం బాబావారికి తెలియకపోతే కదా! అందరికీ పండ్లు ఇచ్చారు. హాయిగా తినండి. మాసా చింత మరచిపోండి అని బాబావారు హితవు చెప్పారు.
అలానే బాబా అంటూ ఎప్పటిలా బుర్ర వూపారు. బాబావారి ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకొని తిన్నారు. అలా ఆ ప్రకారంగా ఆగస్టు రెండవ తేదీపై తెర పడింది. మర్నాడు అంటే ఆగస్టు 3న హార్వాన్‌కి బాబావారు బయలుదేరాలి.
ఇప్పటి వరకూ అంటే శ్రీనగర్ వచ్చినప్పటి నుంచీ బాబావారి మకాం ఓ పడవపైన డాల్ సరస్సులోనే కదా. ఇది పాఠకులకీ తెలుసు. డాల్ సరస్సు ప్రాంతంలో ఎక్కడకి వెళ్ళాలన్నా పడవలపైనే వెళ్ళాలి. ఇటలీ దేశపు వెనీస్ నగరంలో కూడా ఇంతే. అంతా పడవలపైనే. ఆ నగరాన్ని కూడా భూతల స్వర్గంగా వర్ణిస్తారు. ఇంతకీ వెనీస్ నగరానికి మరో విశిష్టత వుంది. ఏసు ప్రభువుగా అవతరించినప్పుడు దేవదేవుడు వెనీస్ సందర్శించాడు. బాబావారే స్వయంగా వెల్లడించారీ సంగతి.
దేశాటన చేస్తూ ఏసు ప్రభువు వెనీసు నగర సందర్శన చేశారుట. అప్పట్లో ఈ నగరం కూడా రోమన్ సామ్రాజ్యంలో భాగమే. వెనీస్‌కి మరో విశిష్టత వుంది. అక్కడి సెయింట్ మార్క్స్ ఓ ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం. ఐరోపా ఖండంలో మొత్తం నాలుగు ఆధ్యాత్మిక కేంద్రాలు వున్నాయట. అవి: వెనీస్, అస్సిసి, తిగురియన్ (ఇటలీ తీరంలో), స్పెయిన్ దేశంలో ఓ పెద్ద బంగళా. ఈ బంగళా ఎక్కడ వుందో బాబావారు ప్రస్తావించలేదు కానీ అది వున్న బయట పూల తోటల మధ్య వున్నదని అంటారు.
మళ్ళా మనం శ్రీనగర్ కథలోకి వస్తే, బాబావారు ఏకాంతంలో వున్నప్పుడు మండలివారు ఏం చేయాలో చెప్పారు. ఆహార, పానీయాది అలవాట్లు ఎలా వుండాలో వివరించారు. మాటల మధ్య అన్నారు. శ్రీనగర్ నుంచి హార్వాన్ వెళ్ళటమంటే,

వెనీస్ నుంచి పాలస్తీనాకి వెడుతున్నట్లే అన్నారు. అమ్మో! అలాగా అనుకొన్నారు మండలివారు. పాలస్థీనా గురించి పాఠకులకి తెలుసు కదా. పాలస్తీనా ఓ పుణ్యక్షేత్రం, మాకే కావాలి అని అటు యూదులు, మీది కాదు ఇది మా పుణ్యక్షేత్రమని ముస్లింలు ఎన్నో ఏళ్ళుగా తగువులాడుతున్నారు. పశ్చిమ ఆసియాలోని పాలస్తీనా సమస్య యుద్ధాలకి దారితీసింది కూడా. అంటే బాబావారు ఏకాంతవాసం చేయబోతున్న హార్వాన్ కొండ కూడా పాలస్తీనా అంత జటిలమయిన జాగా అనుకోవాలి.

బాబావారు హార్వాన్ వెడుతున్న వార్త ఇట్టే ప్రాకింది. డాల్ సరస్సు పడవలవారు బిలబిలా బాబావారి సమక్షానికి వచ్చారు. బాబావారు బసచేసిన పడవ సరంగు భార్య, అయితే దు:ఖం ఆపుకోలేకపోయింది. ఏడ్చి ఏడ్చి కళ్ళు చచ్చిపోయాయి. మమ్మల్ని వదిలి వెళ్ళకు బాబా అని ప్రాధేయపడింది. ఆమె భర్త సుల్తానా కూడా బాబావారిని ప్రార్థించాడు. బాబావారి పాదాలపై పడ్డాడు. తప్పు చేసి వుంటే క్షమించండి తప్ప మాకీ కఠిన శిక్ష వేయవద్దని వేడుకొన్నాడు.

తమ పడవపైనే ఏకాంతవాసం చేయమన్నాడు. మీకు ఏ ఇబ్బందీ కల్గకుండా చేస్తాను బాబా, నా మాట నమ్మండి అన్నాడు. బాబావారు చిరునవ్వు నవ్వారు.

సుల్తానానీ అతని భార్యనీ ఆశీర్వదించారు. మీ అదృష్టం పండింది అన్నారు. తమ నల్ల కోటుని సుల్తానాకి ప్రసాదించారు. ఈ రాత్రికి మీతోటే వుంటానన్నారు. తమ దు:ఖాన్ని దిగమింగుకొని బాబావారికి ఉచిత సపర్యలు చేశారు ఆ దంపతులు. బాబావారికి సంగీతం అంటే ఇష్టం కదా. అందుకని ఆ దొడ్డ ఇల్లాలు సితారపై చక్కని పాటలు వినిపించింది. ఆది పురుషుడు ఆనందించాడు. ఇంతలో ఏమయిందో తెలియదు. బాబావారు ఛాన్జీపై రుసరుసలాడారు. గట్టిగానే చివాట్లు పెట్టారు. శపించారు. కాశ్మీరులోనే నీ సమాధి వుండుగాక, అన్నారు. ఛాన్జీ అవాక్కయాడు వంచిన తల ఎత్తలేదు. ప్రభువుకి ఆగ్రహం తెప్పించే పని ఏమి చేసానబ్బా! అని తల్లడిల్లిపోయాడు.

ఆగస్టు 3వ తేదీ ఉదయం 11 గంటలకి హార్వాన్ దిశగా బాబావారు కదిలారు. డాల్ సరస్సు పడవలవారందరూ బాబావారికి వీడ్కోలు పలికారు. తప్పుచేసి నొప్పించివుంటే క్షమించమని విన్నవించుకున్నారు. బాబావారొక మాటే చెప్పారు. భగవంతుని నమ్మండి. దేముడిపై భరోసా పెట్టి బ్రతకండి దేవదేముడు అందర్నీ ఓ కంట కనిపెట్టి చూస్తుంటాడు. ఎవర్నీ మరచిపోడు. వదలడు. కానీ మీరు కూడా దేవదేముడ్ని మరచి పోకూడదు సరికదా ఎప్పుడూ భగవంతుడిని స్మరిస్తూ వుండాలి అని హితవు చెప్పారు. కరీంకు శాలువా,స్వెట్టరు ఇచ్చారు. కలలో కూడా ఊహించలేదతడు ప్రభువు తన కంటూ ఓ బహుమతి ఇస్తాడని. అందుకనే కరీం ఆనందం పట్టలేకపోయాడు. ఆ ఆనందం కన్నీళ్ళగా మారింది. మనిషి తడిసి ముద్దయ్యాడు. పడవ వాళ్ళందరూ బాబావారి ఫోటో అడిగారు. బాబావారి లాకెట్టు

కావాలన్నారు. బాబావారు అందరికీ తమ ఫోటోనీ, లాకెట్టునీ ప్రసాదించారు. హార్వాన్ కొండపై బాబావారికి ఓ చిన్న కుటీరం కట్టిన సంగతి పాఠకులకి గుర్తుందికదా. కొండ అంచున కట్టారీ కుటీరాన్ని. అయిదు వందల అడుగుల ఎత్తున వుంది ఆ జాగా. ఓ ఇద్దరు మండలివారు బాబావారితో వుంటారు. మిగిలినవారు కొండ క్రింద ఇంట్లో వుండాలి. పిలిస్తేనే వెళ్ళాలి. సరే, అలా, ఆ ప్రకారంగా బాబావారు ఆగస్టు 3న హర్వాన్‌లో అడుగు పెట్టారు. ఇక్కడికి వస్తూనే కొండ ఎక్కారు. కుటీరం పని ఎంత వరకు వచ్చిందో చూశారు. పనివాళ్ళ భుజం తట్టారు. బాగా పని చేస్తున్నారు. తొందరగా కానీండి అన్నారు. కొండపైన గంట సేపున్నారు. కాశ్మీరు గ్రామస్థులు పేదవాళ్ళు. ఈ మాటనే బాబావారు ప్రస్తావించారు. రోజుల తరబడి స్నానం చేయరటవాళ్ళు. నరాలని వణికించే చలిలో స్నానం ఏం చేస్తారు? వేడి నీళ్ళు పోసుకోవచ్చుకానీ, వంటా వార్పుకే కట్టె పుల్లలు దొరకటం కష్టమైన రోజుల్లో నీళ్ళు కాసుకోవడానికి కట్టెలు ఎక్కడ దొరుకుతాయి? అందుకనే స్నానం సంగతి మరచిపోయారు వాళ్ళు. మరి మీరు? ఓ నాలుగు రోజులు స్నానం లేకపోతే కొట్టుకుపోతారని బాబావారు మండలివారిని ఎద్దేవ చేశారు. మీకు అలవాటయిన భోజనం దొరక్కపోయినా ఏదో తప్పి పోయినట్లు బాధపడతారు. మీ తత్వమే అంత. ఇదంతా అలవాటు మహిమ. ఏది అలవాటయితే, ఆ ప్రకారమే ఉండాలనుకోవడం మానవ లక్షణం అన్నారు. మీ వెంట ఉంటున్నా కాబట్టి మీరు సర్దుకుపోగలుగుతున్నారు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా భరించగలుగుతున్నారు. మరి నేను హర్వాన్ కొండపై ఏకాంతవాసానికి వెళ్ళాక గడ్డురోజులు వస్తాయి. ఏదో ఒక కష్టం, ఇబ్బంది తరుముతూ వస్తుంది. అయినా భయపడకండి. నేనున్నానుగా! వాటి సంగతి నేను చూసుకుంటాను అన్నారు. అలా అంటూనే తమ పాత అతుకుల బొంత కోటుని దుమ్ము దులిపారు, వేసుకున్నారు. చలి వేస్తుంది కాబట్టి కోటు వేసుకుంటున్నారులే అనుకున్నారు మండలివారు. వాళ్ళ అనుమానం నిజమైంది. రండి వెళదాము కొండపైకి అన్నారు రావ్‌సాహెబ్, ఛాన్జీ, బువాసాహెబ్, రమ్జూ, అబ్దుల్లా, ఆఘా ఆలీ, ఆలీ అక్బరు కూడా బాబావారితో కొండ ఎక్కారు. వీరంతా తిరిగి వచ్చేసరికి చలి గడగడ వణికిస్తోంది. బాబావారి కోసం మెత్తని తివాచి పరిచారు. ఇది నాకు వద్దు అంటూ ఆఘా ఆలీని దానిపై పడుకోమన్నారు. మర్నాడు, ఆగస్టు 4వ తేది ఆదివారం. దేశాటనలో ఉన్నపుడు ఆదివారాలు, సోమవారాలు అన్నా తేడా ఏముంటుంది? అన్ని రోజులు పని దినాలే కదా! ఎప్పుడు ఏ అవసరం వస్తుందో ప్రభువుకి తెలియదు. తెలిసిందల్లా దైవీ మానవుడికి మన వల్ల ఏ కష్టము రాకూడదన్న తపన ఒక్కటే.

**- సశేషం**

# ఆదీ, ఏరుచ్‌లు – భరత, లక్ష్మణులు

– మంత్రవాది బాలగంగాధర శాస్త్రి
(యం.బి.జి.), హైదరాబాద్.



నేను బాబా ప్రేమలోకి వచ్చాక, సో॥ ఆదీ కె. ఇరాని, సో॥ ఏరుచ్ జెస్సావాలాలతో నాకెంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ మాటకొస్తే బాబా ప్రేమికులు చాలామందికి ఈ ఇద్దరూ అత్యంత సన్నిహితులు. అవతార్ మెహెర్‌బాబాకు ఆదీ.కె.ఇరానీ ప్రధాన శిష్యుడు మరియు కార్యదర్శిగా ఉంటూ, బాబాను కలవాలనుకొనే వారందరికీ సహాయపడేవారు. ఏరుచ్ మెహెర్‌బాబాకు వ్యక్తిగత సేవకుడిగా వుండేవారు. మౌనంలో వున్న మెహెర్‌బాబా సంజ్ఞల ద్వారా ఇచ్చే సందేశాలను భక్తులందరికీ అర్ధమయ్యేలాగా వివరించే చెప్పే భగవంతుని స్వరం ఏరుచ్. ఆదీ కె. ఇరానీ, ఏరుచ్‌లు గురించి తలుచుకున్నప్పుడల్లా, నాకు మనస్సులో శ్రీరాముని అవతారంలో, రాముని సోదరులు భరత – లక్ష్మణులు గుర్తుకువస్తారు. శ్రీరాముడు తాను 14 సంవత్సరాల అరణ్యంలో వున్నప్పుడు, భరతునికి రాజ్యాన్ని పాలించే అధికారం ఇచ్చాడు. రాముని 'పాదుకలు' సింహాసనంపై పెట్టి, రాముడి పేరు మీద భరతుడు రాజ్యపాలన చేశాడన్న సంగతి మనందరికీ తెలుసు. ఆ రకంగా ఆదీజీని భరతుడితో పోల్చవచ్చని నా అభిప్రాయం. ఎలాగంటే, బాబాతో వెళ్ళేటప్పుడు మినహాయించి, ఎక్కువగా అహ్మద్‌నగర్‌లోనే వుంటూ, మెహెర్‌బాబా తరఫున ఆయన భక్తులందరితో ఉత్తర – ప్రత్యుత్తరాలు చేసే పనిని బాబా ఆదీకి అప్పగించారు.

అలాగే, రాముడితోపాటు అరణ్యానికి వెళ్ళి, రాముడి అవసరాలు ఎప్పటికప్పుడు తీరుస్తూ ఒక వ్యక్తిగత సేవకుడిగా ఉన్న లక్ష్మణుడి మాదిరిగా, మెహెర్‌బాబాకు వెన్నంటే వుండి బాబాకు విశేష సేవలందించినవాడు ఏరుచ్. ఏరుచ్ కూడా లక్ష్మణుడి మాదిరి వివాహం చేసుకుని కూడా, బ్రహ్మచారిగా తన స్వామికి అంకితమై సేవలందించారు.

ఆదీ.కె.ఇరానీ తన స్వీయ రచనలో తాను బాబా పరిధిలో ఎలా సేద తీరాడో వివరించే విశేష రచన ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి.

## స్వీయ రచన

# ఆదీ.కె.ఇరానీ

మాది ఉమ్మడి కుటుంబం. మా పూర్వీకులు పర్షియన్ దేశీయులు. మా నాన్న - ఆయన సోదరి కుటుంబం అందరూ 19వ శతాబ్దం చివరలో అహ్మద్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. మా అమ్మ పేరు గుల్‌బాయ్. ఆ పిదప గుల్మాయిగా అందరూ పిలిచేవారు. మా నాన్నగారి సోదరి పేరు కూడా గుల్‌బాయ్. ఆమెను గుల్నార్ అని పిలిచేవారు. మా నాన్నగారి పేరు ఖైఖుస్రూ. మా మేనత్తగారి భర్త పేరు కూడా ఖైఖుస్రూ. వీరి కుమారుడి పేరు సరోష్. అందరూ అహ్మద్‌నగర్‌లోని ఖైఖుస్రూ క్వార్టర్స్‌లో కలసి మెలసి ఉండేవాళ్ళం. మా అందరికంటే ముందుగా మా మేనత్త సాకోరీ ఉపాసనీ మహారాజ్ దర్శించుకుంది. ఆ తర్వాత 1918 ప్రాంతంలో మా అమ్మ కూడా ఆమె ద్వారానే ఉపాసనీ మహారాజ్ గురించి తెలుసుకుని, ఆయన దర్శనం చేసుకుంది. ఉపాసనీ మహారాజ్‌ని తన ఆధ్యాత్మిక గురువుగా మా అమ్మ భావించింది. ఆ తర్వాత్తర్వాత నేను తప్పించి మా ఇంట్లో మా నాన్నగారు, మా సోదరులు రుస్తుం, నా చెల్లెళ్ళు డాలీ, పిరోజాలు, ఇలా అందరూ ఉపాసనీ మహారాజ్ శిష్యులయ్యారు. మహాబలేశ్వర్‌కు దగ్గర్లోని పంచగని పార్శీ హైస్కూల్‌లో మూడేళ్ళపాటు నేను చదువుకున్నాను. నేను 7వ తరగతి చదువుతున్న రోజులవి. స్కూలుకి సెలవులిస్తే పంచగని నుండి అహ్మద్‌నగర్‌కు వచ్చాను. మా అమ్మ అప్పటికే మహారాజ్ ఆశ్రమానికి సాకోరీ తరచు వెళ్ళి వస్తోంది. ఒకరోజున సాకోరీ వెళ్ళాలంటే ఆమెతో వెళ్ళేందుకు తోడు ఎవరూ లేకపోవడంతో తనతో నన్ను రమ్మనమని అడిగింది. మహారాజ్ హిందూ మత గురువు. మనం పార్శీయులం. జోరాస్టరు మన మత గురువు. కాబట్టి, మహారాజ్‌ను ఆధ్యాత్మిక గురువుగా నేను అంగీకరించలేనన్నాను. అక్కడికి రావడం నాకిష్టం లేదని ఖరాఖండీగా చెప్పాను. మహారాజ్‌పై నీకు నమ్మకం ఉన్నా లేకపోయినా నాకు తోడుగా సాకోరీ దాకా వచ్చి నీ మానాన నువ్వు తిరిగి అహ్మద్‌నగర్‌కు వచ్చేయమంది మా అమ్మ. అక్కడి దాకా ఒంటరిగా వెళ్ళాల్సి వస్తోంది కాబట్టి నిన్ను నాతో తోడుగా రమ్మంటున్నానంది. ఆ రోజుల్లో సాకోరీలో మహారాజ్ ఆశ్రమం ఊరుకి దూరంగా వుండింది. చుట్టూ పొలాలు, పొదలతో వుంది. మహారాజ్ చిన్న గుడిసెలాంటి ఆశ్రమంలో ఉండేవారు. చిన్న ఎత్తైన పీఠంపై షిరిడీ సాయి చిత్ర పటం ఉండేది. స్థానికులు చాలా కొద్ది మంది మహారాజ్‌ను ఆరాదించేవారు. నేను తొలిసారిగా సాకోరీకి వెళ్ళినప్పుడు మహారాజ్ దూరంగా ఎక్కడి నుంచో నడుచుకుంటూ వస్తున్నారు.

మహారాజ్ తన ఆశ్రమంలో అడుగిడగానే మా అమ్మ ఆయన పాదాలకు నమస్కరించి తనతో తెచ్చిన పెద్ద పూల దండను మహారాజ్ మెడలో వేసింది.

మహారాజ్ తొలి దర్శనంలోనే నా మనస్సులోని అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. నేనూ ఆయన పాదాలపై ప్రణమిల్లాను. ఆ దరిమిలా ఆయనతో నాకూ ఎంతో సాన్నిహిత్యం ఏర్పడింది. పంచగని హైస్కూల్‌లో చదువుకుంటూ మరాఠీలో నేను మహారాజ్‌కు ఉత్తరాలు రాశాను. నా ఉత్తరాలన్నింటికీ మహారాజ్ పోస్టు కార్డుపై జవాబిచ్చారు. మహారాజ్ శిష్యురాలు శ్రీమతి దుర్గాబాయ్ చేత నా ఉత్తరాలకు జాబు రాయించారు. మహారాజ్ నాకు రాసిన లేఖలు చాలాభాగం నేను భద్రంగా దాచుకున్నాను. ఆ లేఖల్లో మహారాజ్ ఎంతో ప్రేమతో నా ఆరోగ్యం గురించి అడుగుతూ బాగా చదువుకోవాలని సూచించేవారు. 1921 సెప్టెంబర్ 30న సాకోరీ ఆశ్రమం నుండి మేర్వాన్, మెహెర్‌బాబా నాకొక లేఖ రాశారు.

మెహెర్‌బాబా ఆ రోజుల్లో మహారాజ్ ఆశ్రమంలో ఉండేవారు. దుర్గాబాయ్ చెప్పిన మాటల్ని మెర్వాన్ పోస్టు కార్డుపై రాసి నాకు పంపారు. మెట్రిక్యులేషన్ పరీక్ష రాశాక, అహ్మద్‌నగర్‌కు వచ్చాను. మా నాయన నగర్‌లో, పార్శీ ధర్మశాలకు దగ్గర్లో మూడంతస్థుల పెద్ద ఇంటిని కొన్నారు. ఆ ఇంట్లోనే మా వాళ్ళు రెండు దశాబ్దాలకు పైగా ఉన్నారు. ఈ కొత్త ఇంటి గృహ ప్రవేశానికి మహారాజ్‌ను ఆహ్వానించాలని మా అమ్మ కోరిక. కానీ ఉమ్మడి కుటుంబంలో ఆమె మాటకు అంగీకారం వెంటనే దొరకదు.

మా ఇంట్లోనే మహారాజ్‌ను వ్యతిరేకించేవారున్నారు. ఈ రెండూ భిన్న ధృవాల మధ్య మా నాన్న ఎటూ చెప్పలేక ఇబ్బందిపడ్డారు. ఎలాగైతేనేం మా నాన్నను ఒప్పించి, మహారాజ్‌ని గృహప్రవేశానికి ఆహ్వానించారు. మహారాజ్ మా ఇంట్లో వారం రోజులుపైగా ఉన్నారు. స్థానికంగా గల అన్ని కులాలు, మతాలవారు మహారాజ్‌ని దర్శించుకున్నారు. పార్శీలు అహ్మద్‌నగర్‌లో సుమారు 200 మంది దాకా వున్నారు. వారందరూ హిందూ మత పెద్దను మా ఇంటికి ఆహ్వానించామని చెప్పి మమ్మల్ని దుమ్మెత్తిపోశారు. పార్శీ మతాన్ని భ్రష్టుపట్టిస్తున్నామన్నారు. తమ మతానికి వ్యతిరేక పనులు చేస్తున్నామని మా అమ్మా నాన్నలను ఆడిపోసుకున్నారు. నాకప్పుడు 15 – 16 సంవత్సరాల వయస్సు. ఎంతమంది ఎన్ని మాటలన్నా, తొణకక బెణకక నిండు కుండలా అన్నీ భరించిన మా అమ్మ ధైర్యాన్ని దగ్గరగా చూశాను.

ఆమె మౌనంగా ఎన్నో బాధలు భరించింది. సన్నగా,పీలగా గుంభనంగా వుండేదామె. మాది ఉమ్మడి కుటుంబం కదా. అనేక విషయాలకు ఆమె పలువురి ఇష్టా ఇష్టాలపై ఆధారపడేది. అత్తారింట ఆరళ్ళకు ఆవిడకేమీ కొదవలేదు. ఈ నేపథ్యంలో మా అమ్మ తన ఆధ్యాత్మిక గురువు ఉపాసనీ మహారాజ్‌ని తన కొత్త ఇంటికి ఆహ్వానించింది. భగవంతుని లీలలు అనంతం.

నా తల్లికి అత్తారింట ఆరళ్ళు, ఇతర సంసార చిక్కుల నుండి ముందుగా ఉపాసనీ మహారాజ్ ఆ తరువాత అవతార్ మెహెర్‌బాబా ఎంతగానో సహాయపడ్డారు. వారి ఆధ్యాత్మిక, ప్రేమమయ వాతావరణంలో ఆమె తన ఇంట్లోని ఇక్కట్లు మరచిపోయేలా చేశాయి. మెహెర్‌బాబా మా అమ్మను తన తల్లిగా భావించేవారు. ఆమె పేరు గుల్‌బాయ్ అయితే, గుల్మాయిగా మెహెర్‌బాబానే మార్చారు.

## నేను మెహెర్‌బాబాను ఎలా కలిసాను?

మేర్వాన్‌ను భృకిటిన బాబాజాన్ పూనేలో ముద్దు పెట్టుకున్నాక సుమారు తొమ్మిది నెలల తర్వాత మేర్వాన్ (మెహెర్‌బాబా) సాకోరీ ఆశ్రమం ఉపాసనీ మహారాజ్ దగ్గరకు వచ్చారు. సాకోరీ ఆశ్రమంలో సుమారు ఏడు సంవత్సరాలు వున్నారాయన. బాబాజాన్ ముద్దాడిన పిదప భగవత్ చైతన్యం కలిగిన మేర్వాన్ ఖేడ్గావ్‌లోని నారాయణ మహారాజ్, తాజుద్దీన్ బాబా – నాగపూర్, సాయిబాబా – షిరిడీ, చివరిగా ఉపాసనీ మహారాజ్‌ని కలిసారు. ఉపాసనీ మహారాజ్ భగవత్ చైతన్యంలో ఉన్న మేర్వాన్‌ని మానవ చైతన్యం తిరిగి పొందేలా చేశారు. ఒకసారి భగవత్ చైతన్యం లభిస్తే తిరిగి అది మరెక్కడికీ పోదు. సద్గురువులు మాత్రం భగవత్ చైతన్యంతో పాటు మానవ చైతన్యం కూడా కల్గి వుంటారు. ఉపాసనీ ఆశ్రమంలో ఉంటున్న మేర్వాన్ గురించి విశేషంగా మా అమ్మ తరచూ చెప్తుండేది. అతడిని నేను సాకోరీలో చూసేదాకా, మా అమ్మ మేర్వాన్ గురించి చెప్పింది చెప్పకుండా ఎంతో ప్రేమగా, గొప్పగా చెప్పుకొచ్చేది. మేర్వాన్ సన్నగా, లేత పసిడి కాంతులీనుతూ చాలా అందంగా వుండేవారు. ఆయన కళ్ళు చాలా తీక్షణంగా వుండేవి. వడివడిగా వేగంగా నడుస్తూ అందరినీ పలకరిస్తూ, పాటలు పాడుతూ సాకోరీ ఆశ్రమమంతా కలియ తిరుగుతుండేవారు. ఆయన తనదంటూ ఓ ప్రపంచంలో వున్నాడనిపించేది. తన గొప్పతనం గురించి ఆయన ఎన్నడూ పన్నెత్తు మాట పలకలేదు. బాబాజాన్, ఉపాసనీల ఆధ్యాత్మికతను వల్లెవేస్తుండేవాడు. తన సుఖం కాని, దుస్తుల గురించి కానీ ఏమీ పట్టించుకునేవాడు కాదు. అనంత ప్రేమ సాగరంలో తేలియాడుతున్నట్లుండేవాడు. అనేక ఆధ్యాత్మిక విషయాలపై సాధికారికంగా మాట్లాడేవాడు. మేర్వాన్‌తో నా తొలి సమావేశపు విశేషత ఏమీ బాగా గుర్తులేదు కానీ, ఆ దరిమలా మేర్వాన్‌కు నాపై గల అమిత ప్రేమానురాగాలకు నేను ముగ్ధుడనైనాను. ఆ తర్వాత నేను మేర్వాన్‌ని సాకోరీ ఆశ్రమంలో చాలాసార్లు చూశాను. ప్రతిసారీ ఆయన తన శారీరక సుఖం గురించి ఏమాత్రం పట్టించుకోనివాడిలా నాకు కనిపించాడు. అహ్మద్‌నగర్‌లోని మా కొత్త ఇంటి గృహప్రవేశానికి మహారాజ్ వచ్చినప్పుడు మేర్వాన్, గుస్తాద్‌జీలు కూడా ఆయనతోపాటు వచ్చారు. మేర్వాన్ నాకప్పుడు

సాకోరీలో నేను చూసినట్లే అగుపించాడు కానీ, ఈసారి ఆయన నాపై అవ్యాజ్య ప్రేమ కురిపించాడు. అది ఎలాంటి ప్రేమ అంటే ఒక తండ్రి తన కొడుకుపై కురిపించే ప్రేమ, లేదా అన్నగారు తన తమ్ముడిపై చూపే ప్రేమతో సరిపోల్చవచ్చు. మహారాజ్‌తోపాటు మేర్వాన్ కూడా ఆ వారం రోజులు మా ఆతిథ్యంలో వున్నారు. అయితే ఆ సమయంలో నేను జ్వరంతో నా మంచానికి అతుక్కుపోయాను. దాంతో నన్ను మా ఉమ్మడి కుటుంబం తాలూకు పాత ఇంట్లోని ఒక గదిలో వుంచారు. మహారాజ్ క్వినైన్ మాత్రలు ఇచ్చారు. మేర్వాన్ నా జ్వరం ఎలా వుందని ఉదయం సాయంత్రం పలుసార్లు స్వయంగా వచ్చి నా బాగోగులు చూసేవారు. అంతేకాదు నన్ను మంచంపై నుంచి కూర్చోపెట్టడం, సాయంత్రం పూట ఆరు బయటకు తోడుగా తీసుకెళ్ళాడు. ఆ సమయంలో మేర్వాన్ నా ఎడల చూపిన ప్రేమను నేను ఎన్నటికీ మర్చిపోలేను. మేర్వాన్‌కు మధురమైన గాత్రం వుండింది. 'జ్యూసీ' వాయిస్ అని నేనంటాను. ఎక్కువగా ఉర్దూ, పర్షియన్ ఘజల్సు ఆలాపించేవాడు. కబీరు – తుకారాం భజనలు చేసేవాడు. జ్వరం నుండి నేను కాస్త కుదుటపడ్డాక, ఆయన మధురంగా ఆలాపిస్తుంటే నేను హార్మోనియం వాయిద్య సహకారం అందించాను. మేర్వాన్ స్వయంగా ఉర్దూలో ఘజల్సు, గుజరాతీలో అనేక పాటలు రాసాడు. ఒకరోజున మేరాన్ నా భవిష్యత్ కార్యక్రమం గురించి మాట్లాడారు. మా ఇంటి పెరట్లో వున్న బావి దగ్గర ఈ విషయాలు మేర్వాన్ నాతో ముచ్చటించారు. ఆ మాటలు నాపై ప్రగాఢ ప్రభావాన్ని చూపాయి. ఆలాగే నా జీవితాంతం ఆయన శిష్యగణంలో ఒకనిగా చేరేలా చేశాయి. దానికి తోడు మా అమ్మ తరచూ మేర్వాన్ ఎడల చూపే ప్రేమ, అతని గురించి నాతో చెప్పే విషయాలు నాకు తెలియకుండానే మేర్వాన్ పట్ల అమిత గౌరవం, భక్తి, ప్రేమ కాలక్రమంలో నేనుగా ఆయనకు అంకితమయ్యాను. మెట్రిక్యులేషన్ పాసయ్యాక, పూనే డెక్కన్ కాలేజీలో డిగ్రీ కోర్సులో చేరాను. ఈ సమయంలో కూడా నా మనస్సు తరచు మేర్వాన్‌కి సంబంధించిన ఆలోచనలతో నిండి వుండేది. చాలా రోజుల తర్వాత మేర్వాన్ చిన్ననాటి స్నేహితుడు బైలీ నన్ను పూనేలో కలిసి ప్రస్తుతం మేర్వాన్ పూనేలోని కాస్బాపేటలో వుంటున్నాడని చెప్పాడు. అది తెలిసి నేను ఎంతో సంతోషించాను. కాస్బాపేటలో మేర్వాన్ ఉంటున్న అడ్రస్సు తెలుసుకుని, ఒకరోజున వెళ్ళి అక్కడ ఆయన్ని కలిసాను. మేర్వాన్ కూడా నన్ను చూసి చాలా సంతోషించాడు. కాస్బాపేటలో మేర్వాన్ తన చిన్ననాటి స్నేహితులైన అర్జున్, సదాశివ పటేల్ ఇళ్ళకు తరచు వెళ్తుండేదారు. మేర్వాన్ తన దర్శనార్థం వచ్చేవారిని కలవడం, భజనలు, ఘజల్సు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తుండేవాడు. మేర్వాన్‌కు భోజనం ఆయన మేనత్త దౌలతామాయి ఇంటి నుండి వచ్చేది. మేర్వాన్‌తోపాటు ఆయన మిత్రలు అందరూ కలిసి ఈ భోజనం తినేవారు.

కొన్నిసార్లు నేను కూడా ఆ క్యారేజి భోజనం చేశాను. ఈ సమయంలో కూడా మేర్వాన్ తన శారీరక అవసరాలను పట్టించుకునేవాడు కాదు.
మంచి దుస్తులు ధరించేవాడు కాదు.
ఆ తర్వాత రోజుల్లో బాపూ అనే బ్రాహ్మణ యువకుడు మేర్వాన్ దర్శనార్థం వస్తూ పోతుండేవాడు. ఆ పిదప బాపూనే మేర్వాన్ కోసం ప్రత్యేక భోజనం వండి పెట్టేవాడు. మేర్వాన్ కాస్బాపేటలో వుండగా ప్రతి వారం ఆదివారం సాయంత్రం తప్పనిసరిగా ఆయన దర్శనార్థం వెళ్ళేవాడిని. ఈ సమయంలోనే మేర్వాన్ ప్రభోదించిన ఆధ్యాత్మిక ప్రవచనాలు నాలో ఎంతో మార్పుని తీసుకొచ్చాయి. జీవితాంతం ఆయన పాదాల చెంత శిష్యునిగా వుంచేలా చేశాయి. ఆ రోజుల్లో మేర్వాన్ నాతో అన్న మాటలు నేటికీ నా చెవులలో మారు మ్రోగుతున్నాయి. చదువుకునే రోజులలో నీ ప్రధానమైన పని కాలేజీలో చదువుకోవడం. ఆపై నీ హృదయాన్ని నాపై దృష్టి సారించు. నా గురించి ఆలోచించడమే నీ ప్రధాన వ్యాపకంగా జీవించు అని సూచించారు. ఆ రోజుల్లో నా వయస్సు 19 సంవత్సరాలు. బాబా మాటలు సూదంటి రాయిలా నా హృదయాన్ని నేరుగా తాకాయి.
నేను చదువుకునే సమయంలో కూడా నిన్ను స్మరించుతూ ఉండాలా బాబా అని అడిగినప్పుడు – లేదు – లేదు – నీ పరీక్షలు, చదువుకోవడం అయిపోయాక, నీ తీరిక సమయంలో, నీ ఖాళీ సమయంలో నన్ను నీ హృదయంలో గుర్తుంచుకోవాలని బాబా సూచించారు. ఒక తల్లి తన బిడ్డనో, అన్నగారు తన తమ్ముడిని ప్రేమించడమంటే ఇరవై నాల్గు గంటలూ వారిని అంటిపెట్టుకుని ఉండటమా? అని మేర్వాన్ ప్రశ్నించారు.

## పూనే జోపిడీ

ఆ తర్వాత రోజుల్లో పూనేలోని ఫెర్గూసన్ కాలేజి సమీపంలో సుమారు వెయ్యి గజాల స్థలంలో తానుండటానికి చిన్న జోపిడీ ఏర్పాటు చేసుకున్నారు. పగలంతా అక్కడే వుంటూ, రాత్రిళ్ళు కొన్నిసార్లు కాస్బాపేట ఆశ్రమం కేసి వెళ్ళేవారు. బాబాతో పాటు పగటిపూట ఓ డజను శిష్యులుండేవారు. రాత్రిళ్ళు బైలీ, అర్జున్‌లు ఉంటుండేవారు. బాబా ఇక్కడుండగా నేను రోజూ సాయంత్రం పూట వెళ్ళి వస్తుండేవాడిని. ఆదివారం నాడు మాత్రం జోపిడీలో బాబాతోనే గడిపేవాడిని. అప్పుడప్పుడు అహ్మద్‌నగర్ నుండి గుల్మాయీ వస్తుండేది. అలాగే నా సోదరుడు రుస్తుం, ఇతర బంధువులు వస్తుండేవారు.

## అవతారుని ఆంతరంగిక కార్యక్రమం

మెహెర్‌బాబా సాకోరీ ఆశ్రమంలో సుమారు ఏడు సంవత్సరాలు వున్నారన్న సంగతి ముందు పేజీల్లో తెలుసుకున్నాం. ఆ పిదప ఆయన సాకోరీ వదలి పూనేలోని కాస్బాపేట,

ఫెర్గ్గాసన్ ప్రాంతాలలో చిన్నపాటి ఆధ్యాత్మిక కేంద్రాలను ప్రారంభించారు. ఐతే, ఈ సమయంలో బంగారు కాంతులీనే అవతారుని ముఖవర్చస్సు నల్లగా మారింది. బాబా కూడా చాలా నీరసంగా అగుపించారు.

ఇలా ఆయన నడవడిలో, ప్రవర్తనలో అనేక మార్పులు చాలా దగ్గర నుండి పరిశీలించే అవకాశం, భాగ్యం నాకు లభించాయి. ఈ మార్పులన్నింటికీ ప్రధాన కారణం భగవత్ చైతన్యం, మానవ చైతన్యం రెంటి ప్రభావం వల్లనేనని నా అభిప్రాయం. మెహెర్‌బాబాతో నా అనుబంధం క్రమేణా రోజురోజుకీ పెరగసాగింది. లేదా ఆయన నా హృదయాన్ని అతి చేరువగా చేరాడనిపించింది. క్షణం ఖాళీగా వుంటే నా మనస్సంతా ఆయన ధ్యాసలోనే గడిపేవాడిని. రాత్రిళ్ళు నిద్రలో కూడా నా హృదయమంతా ఆయన ధ్యాసతోనే నిండివుండేది. కాస్తంత మెళుకవగా వున్నా కూడా బాబా గురించే ఆలోచనలు, ఆ తర్వాత ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడెప్పుడు వెళ్ళి ఆయన్ని చూద్దామా అనేటట్లు నా మనస్సు ఆయన దర్శనం కోసం పరితపించేది.

## ప్రేమలో పడ్డాను

నేను కాలేజీలో చదువుకునే రోజుల్లోనే నా క్లాస్‌మేట్ అమ్మాయితో ప్రేమలోపడ్డాను. ఆ అమ్మాయి కూడా పార్శీయిరాలే. ఐనా కూడా మా అమ్మకు నా ప్రేమ వ్యవహారం నచ్చలేదు. ఈ విషయంపై మా అమ్మ ఉపాసనీ మహారాజ్‌కు ఫిర్యాదు కూడా చేసింది. ఓ రోజున మహారాజ్ నన్ను అడిగారు. ఆ అమ్మాయితో సన్నిహితంగా ఉండొద్దని మహారాజ్ నన్ను హెచ్చరించారు. అది నావల్ల కాదని స్పష్టంగానే చెప్పాను.

ఐతే తిరిగి ఈ విషయాన్ని బాబా చెవిని వేసింది మా అమ్మ. బాబా మమ్ములందర్నీ పూనాలోని సదాశివ పటేల్ ఇంటికి పిలిపించారు. నేను, ప్రేమించిన అమ్మాయి, మా అమ్మ ముగ్గురం బాబా ఎదుట కూర్చున్నాం. ఆ అమ్మాయితో ఆదీతో నీ వివాహం కుదరదని హెచ్చారించారు. అతను నా వాడని అన్నారు. ఆదీని మరిచిపొమ్మన్నారు. ఒకవేళ వివాహం జరిగినా, అది సఖ్యతగా పది కాలాలపాటు నిలవదనీ హెచ్చరించారు. ఆ అమ్మాయి కళ్ళు కన్నీటితో నిండాయి. ప్రేమించినందుకు ఎన్ని కష్టాలు ఎదురైనా ఎదురొడ్డడానికి నేను సిద్ధంగానే వున్నాను. కానీ ప్రేమావతారుని ఎదుట నా నోట మాట పెగలలేదు. నేనూ మా అమ్మను అమితంగా ప్రేమిస్తాను. అవతారుని ప్రేమ ముందు నా మాతృప్రేమ కూడా అత్యల్పమేనని నా కర్థమయింది. ఆ అమ్మాయి తల్లితండ్రులకూ మా ప్రేమ విషయమై ఏమాత్రం ఇష్టం లేదు.

ఏతావాత జరిగినదంతా తెలుసుకుని వారూ సంతోషించారు.

## అమ్మాయి తల్లి

ఆ తర్వాత ఆ అమ్మాయికి మరొకనితో పెళ్ళయింది. ఆమె భర్త మంచి ధనవంతుడు.

ఇరాన్‌లో వుంటాడు. అమ్మాయి తండ్రికి కూతుర్ని ఇరాన్‌కు పంపడం ఇష్టంలేదు. సిరిసంపదలెన్ని వున్నా ఆ అమ్మాయి సంతోషంగా లేదు. తన కూతురు బాధ చూడలేక, ఆమె తల్లి ఒకరోజున బాబా దగ్గరకు వచ్చింది. తన బాధ వెళ్ళబోసుకుంది. ఆమె మనస్సులోని కోరిక త్వరలో తీరుతుందని బాబా భరోసా ఇచ్చారు. ఐతే, ఆ కోరిక తీరాక, ఒక రోజున వచ్చి బాబా వుంటున్న జోపిడీని చీపురుతో శుభ్రం చేయాలన్నారు. ఆమె అదెంత పని బాబా అంది. అందుకు అంగీకరించింది. ఆ దరిమలా ఆమె అనుకున్నట్లే అంతా సవ్యంగా జరిగింది. కానీ, బాబాకిచ్చిన వాగ్దానం మరచిపోయింది. తిరిగి బాబావారి జోపిడీ కేసి కన్నెత్తి కూడా చూడలేదు. చీపురు పట్టనూ లేదు. ఇదంతా ఇలా వుంటే ఆ తర్వాత్తర్వాత నాకేం తెలిసిందంటే, ఆమె కూతురికి జరిగిన ఒక దుర్ఘటన వల్ల తల్లిగా ఆమె మనస్సు తట్టుకోలేకపోయింది. మతి స్థిమితం తప్పిందామెకు. పిచ్చిదానిలా మారింది. ఐతే, ఇదంతా ఆమె తిరిగి బాబాను దర్శించుకోలేదు కాబట్టి, ఆమె బాబాకిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోలేదు కాబట్టి ఇలా జరిగిందని నేను ఈ మాటలు చెప్పడం లేదు. ఈ బాధలు ఏవైతే వున్నాయో ఆమె తప్పక అనుభవించాల్సిందే. అదంతా ఆమె గత జన్మ సంస్కార సేతు బంధనమే. అయితే ఏమంటే ఆమె బాబాకిచ్చిన మాట ప్రకారం నడుచుకుని వుండి వుంటే ఈ బాధ తీవ్రత తగ్గి వుండేదేమో! ఈ బాధ వివరణగా అవతారుడు ఆమెకు "ఆ పనిని" అప్పగించి వుండవచ్చు. బాబా తన ఆపన్న హస్తం అందించారు. దురదృష్టం వెంటాడడంతో ఆమె ఆ అవకాశాన్ని జారవిడుచుకుంది.

## విధేయత:

ఆ రోజుల్లో ఎంత దూరమైనా బాబా కాలినడకనే వెళ్ళేవారు. దూరప్రాంతాలకయితే మాత్రం రైల్లో మూడవ తరగతిలో ప్రయాణించేవారు. పూనేలోని ఫెర్గూసన్ కాలేజి, జోపిడీ నుండి సదాశివ పటేల్ ఇంటికి కానీ, కంటోన్మెంట్ ప్రాంతంలో వున్న వారి తల్లితండ్రుల ఇంటికి ఇలా ఎంత దూరమైనా నడుచుకుంటూ వెళ్ళేవారు. అలా బాబా నడుచుకుంటూ వెళ్ళే సమయంలో ఆయన శిష్యులతోపాటు నేనూ చాలాసార్లు పాల్గొన్నాను. ఈ సమయంలో బాబా అనేక చిన్న చిన్న కథల రూపంలో అనేక ప్రవచనాలు ఇచ్చేవారు. ఈ సందేశాలలో ఎక్కువగా సద్గురు ఆదేశాలను తు.చ. తప్పక విధేయతతో పాటించాలని ప్రబోధించేవారు. సద్గురువు సహాయం లేకుండా భగవంతునిలో ఐక్యం సాధ్యం కాదని పలుమార్లు బాబా చెప్పారు. ఎందుకు? ఏమిటి అని ప్రశ్నించకుండా సద్గురువు ఆదేశాలు ఎలా పాటించాలని బాబా అనేక సున్నిత సందేశాలు ఇచ్చారు. అలాగే మేం ఎప్పుడైనా ఏదైనా అడిగితే మా సందేహాలకు ఎంతో ఓపికగా, ఎన్నో ఉదాహరణలతో జవాబిచ్చేవారు.

## టోపీ గిరివాటేశాను

చిన్నతనం నుండీ తలపై టోపీ పెట్టుకోవడం నాకు చాలా ఇష్టం. ఎండా కాలం కాకపోయినా, పెద్దగా ఎండ లేకపోయినా తలపై టోపీ నేనుంచుకునేవాడిని. ఒకసారి బాబా, ఆయన శిష్యులందరితో కలిసి నడుస్తున్న సందర్భమది. ఆ సమయంలో బాబా నా విధేయతను పరీక్షించాలనుకున్నారో? ఏమో? నా తలపై వున్న టోపీ రోడ్డుకు ఓ ప్రక్కగా వున్న ముళ్ళపొదల్లోకి విసిరేయమన్నారు. ఆ రోజుల్లో సాధారణ టోపీలు ఖరీదు మూడు, నాలుగు రూపాయలు ఉండేది. నేను వాడుతున్నది కార్క్ టోపీ. ముప్పై రూపాయలు పెట్టి ఇష్టపడి కొనుక్కున్నాను. టోపీ నా తలపై లేకుండా వడదెబ్బ తగులుతుందని భయపడేవాడిని. అలాంటిది బాబా ఆ ఖరీదైన టోపీని ముళ్ళపొదల్లోకి గిరవాటేయమనగానే, క్షణకాలం కూడా నేను ఆలోచించ లేదు. ఆ పని చేశేశాను. బాబా చెప్పిన పనిని నిర్వర్తించానని తృప్తి పడ్డాను. బాబా కూడా చాలా సంతోషించారు.

## వేడివేడి కాఫీ

ఒకసారి బాబాకు వేడి వేడి కాఫీ ఇవ్వాలని నేనొక ధర్మాస్ ఫ్లాస్క్ రూ. 6/- పెట్టి కొన్నాను. దానిలో వేడి కాఫీ నింపుకుని సైకిల్‌పై బాబా వున్న చోటకు వెళ్ళాను. సైకిల్ దిగుతుండగా కాఫీ వున్న ఫ్లాస్క్ సైకిల్ హేండిల్ రాడ్‌కు గట్టిగా తగిలి పగిలిపోయింది. ఇది తెలిసి బాబా నాపై గట్టిగా కోప్పడ్డారు. ముందుగా తనకు చెప్పకుండా బజార్లో ఏమీ కొనవద్దన్నారు. ఏమయితేనేమి, పగిలిపోగా మిగిలిన కాఫీని వడగట్టి బాబా త్రాగారు. ఆ మాదిరిగా ఆయన అనుమతి లేకుండా ఏమీ చేయొద్దని హెచ్చరిస్తూనే, నేను తీసుకెళ్ళిన కాఫీ త్రాగి నన్ను తృప్తి పరిచారు.

## వాగ్దాన భంగం

నేను పూనేలోని డెక్కన్ కాలేజీలో చదువుకునే రోజులవి. కాలేజి హాస్టల్లోనే వుండేవాడిని. సెలవు రోజుల్లో ప్రతి ఆదివారం ఉదయం నుండి సాయంత్రం దాకా బాబా దగ్గరకు వెళ్ళి బాబాతోనే వుండేవాడిని. అలా నేను వెళ్ళేటప్పుడు కాలేజీలో, హాస్టల్లో నాతోపాటు చదువుకుంటున్న నా స్నేహితుడు కూడా నాతో వచ్చేవాడు. బాబాని దర్శించుకునేవాడు. అతను బాబాతో మాట్లాడుతూ ప్రతి ఆదివారం నాతోపాటు బాబా దర్శనం కోసం వస్తానని వాగ్దానం చేశాడు. ఐతే, డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు దగ్గర పడ్డాయి. పరీక్షల కోసం నేను పెద్దగా చదవలేదు. పరీక్షలు ప్యాసవుతానన్న నమ్మకం కూడా కరువయ్యింది. నేను యథాప్రకారం ఆదివారం సెలవు రోజున బాబా దగ్గరకెళ్ళి వస్తున్నాను. పరీక్షలకు చదువుకోవాలని నా స్నేహితుడు మాత్రం కాలేజి హాస్టలు గదిలోనే వుంటున్నాడు. పరీక్ష తేదీలు దగ్గర పడ్డాయి. నేనేం రాశానో ఏమో నాకు గుర్తు లేదు. పరీక్ష ఫలితాలు వచ్చాక, నేను ప్యాసయ్యానని నా స్నేహితుడు కబురు

తెచ్చాడు. నా మార్కుల లిస్టు చూసే దాకా నా మనస్సు నన్ను నమ్మలేదు. ఐతే, ఎంతో కష్టపడి చదివిన నా స్నేహితుడు మాత్రం పరీక్షలో నెగ్గలేదు. ఇది నమ్మలేని విషయమయింది. అతని మార్కుల జాబితా చూశాను. బాబాకిచ్చిన వాగ్దాన భగం వల్లనే ఇలా జరిగి వుండవచ్చని నా భావన.

## ఆకస్మిక పిలుపు

ఒక రోజున ఉదయాన్నే బాబాతో పాటు వుండే బైలీ నా కాలేజీ కాంపౌండ్‌లో ప్రత్యక్షమయ్యాడు. బైలీ బాబాని వదిలి నా దగ్గరకు ఆ సమయంలో ఎందుకు వచ్చాడో అర్థం కాలేదు. ఆ మాటే ఆయనతో అడిగాను. బాబా నన్ను పిలుస్తున్నారని చెప్పాడు. పద, పద వెళ్దాం అన్నాడు. క్లాసు రూంలోకి వెళ్ళకుండా అతడ్ని అనుసరించాను. అలా బాబా దగ్గర కెళ్ళి ఆ రోజంతా బాబా సమక్షంలో ఆనందంగా గడిపాను. ఆ రోజు ఆదివారం కాకపోయినా... ఆ రోజుల్లో (1922) గుస్తాద్‌జీ బాబాతోపాటు వుండేవారు. పూనేలోని సదాశివ పటేల్, లేదా అర్జున్ ఇంట్లో బాబా ఎక్కువగా వుండేవారు. బెహ్రాంజీ అప్పుడప్పుడు వచ్చిపోతుండేవాడు. ఆ తర్వాత బైదుల్ బాబా దర్శనం చేసుకుని, ఆయన తన జీవితాంతం అవతారుని పాదాల చెంతనే అంకితమయ్యాడు. మస్తుల అన్వేషణలో భాగంగా బైదుల్ విశేష కృషి చేశాడు.

## ముంబాయికి పాదయాత్ర

1922 మే నెలలో పూనే నుండి ముంబాయికి పాదయాత్ర చేపడదామన్నారు. సుమారు 40 మంది ఈ యాత్రలో పాల్గొన్నారు. ముందుగా అందర్నీ పూనేలో స్థానికంగా గల బాబాజాన్ సమాధిని దర్శించమన్నారు. ఆమె సమాధి దగ్గరకి కొందరు ఒక బృందంగా వెళ్ళారు. మెహెర్‌బాబా పూనేలో చేపట్టిన కాస్బాపేట, ఫెర్గ్యూసన్ కాలేజి రోడ్డులో జోపిడీ తర్వాత చేపట్టిన రెండవ దశ కార్యక్రమం. తొలుత ఉపాసనీ మహారాజ్‌తో, ఆ పిదప బాబాజాన్‌తో గల బాబావారి ఆధ్యాత్మిక సంబంధాలనకు ముగింపు అని చెప్పొచ్చు. పూనేలోని సదాశివ పటేల్ దగ్గర నుండి ముంబాయికి బయల్దేరడానికి అందరూ ఉదయాన్నే సిద్ధమయ్యారు. వారందరికీ బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం దగ్గర్లోని హోటలు వానికి ఆర్డరిచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ పార్శిలు తీసుకొచ్చే పనిని నాకూ, డా॥ ఘనీకి అప్పగించారు.
అలా హోటలు వాని దగ్గర కెళ్ళాక, అతను బ్రేక్‌ఫాస్ట్‌ని పొట్లాలు కడుతుంటే, నాకు ఆకలిగా వుండి, నేను అక్కడే నా కోటా ఫలహారాన్ని తినాలనుకున్నాను. కానీ నాకుగా నిర్ణయం తీసుకోలేదు, డా॥ ఘనీ పర్మిషన్ అడిగాను. అందుకు ఘనీ ఒప్పుకున్నారు. ఆ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ పొట్లాలు తీసుకుని బాబా ఎదుటకెళ్ళేసరికి, కొద్దిగా ఆలస్యమయింది. ఆయనకు తెలియనిదేముంటుంది? బాబా కోపంగా తీక్షణంగా

నాకేసి చూశారు. ఇంత ఆలస్యం ఎందుకయ్యిందన్నారు. జరిగిన విషయాన్నంతా ఉన్నదిఉన్నట్లు చెప్పాను. డా॥ ఘనీ అనుమతితోనే నేను ముందుగా బ్రేక్‌ఫాస్ట్ చేశానని చెప్పాను. బాబా కోపంతో నా చెంప చెళ్ళుమనిపించారు. ఒక్క క్షణం నాకు బాబాపై కోపం వచ్చింది. నా అహంకారం దెబ్బతింది. నా మనస్సు ఎదురు తిరిగింది? ఐతే నా హృదయం ఆయన ప్రేమతో నిండి వుంది. నా హృదయం – మనస్సుని సమాధాన పరిచింది. సద్గురువు చేసే ప్రతి పని మనకు ఆశీర్వాదమౌతుందని, నా అనుభవమే గుర్తుచేసింది.

## ముఖ్యమైన మూడు సంఘటనలు

నేను – మీరూ కలిసి జీవించడంలో గల ఆంతర్యం, ఆ అదృష్టపు విలువ మీకిప్పుడు తెలియదు. ఆ తర్వాతనే మీరు తెలుసుకోగలుతారని బాబా తరచు చెప్తుండేవారు. ఇందుకు సంబంధించి మూడు సంఘటనలు చెప్తాను. ఒకసారి మహారాష్ట్ర మంత్రివర్యులు నాకొక కబురు పంపారు. నేనెంతో బాధల్లో వున్నాను. కొంత ఉపశమనం లభించేలా బాబాకు నా గురించి తెలియజేయమని మంత్రిగారి కోరిక. బాబా ఏకాంతవాసంలో వున్నారా సమయంలో. బాబా మండలి సభ్యుడైన ఏరుచ్‌కు ఒక లేఖ రాస్తూ, చివరిగా మంత్రిగారి గురించి ఒక పంక్తిలో క్లుప్తంగా రాశాను. ఏరుచ్ బాబా ఎదుట ఆ లేఖ చదవడం పూర్తయ్యాక, ఇంకా ఏమైనా విషయాలున్నాయా? అని ఏరుచ్‌ని బాబా అడిగేసరికి, నేను లేఖలో చివరిగా రాసిన మంత్రిగారి కబురు గురించి బాబాకు చెప్పాడు ఏరుచ్. మంత్రిగారికి అంతా మంచి జరుగుతుంది. దిగులు వద్దు. బాబాని గాఢంగా ప్రేమించమని సందేశం పంపారు. మంత్రిగారికి ఈ విషయమే చెబితే బాబాని హృదయపూర్తిగా ఎలా ప్రేమించాలి? అని తిరిగి అడిగారు. మీ భార్యా పిల్లలను ఎలా ప్రేమిస్తారు. మీ కుమారుడుకి ఒంట్లో బాగోలేకపోతే మీరు ఏం చేస్తారు. మీ పనులన్నింటినీ మరచిపోయి పిల్లవాడిపైన దృష్టి పెట్టరూ. అలాగే బాబాని ప్రేమించండి అని సలహా ఇచ్చాను. ఓ 15 రోజుల తరువాత అంతా బాగుంది, సంతోషంగా మనస్సు కుదుటపడిందని మంత్రిగారు నాకు తిరిగి కబురు పంపారు.

ఇది 1928 నాటి మాట. మా సోదరుడితో కలసి నేను నాసిక్‌లో ఉంటున్నాను. బాబా కూడా ఆ సమయంలో నాసిక్‌లో వున్నారు. ఒక రోజున బాబా నాకు కబురు పంపారు. మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు నాసిక్ బాబా ఆశ్రమం దగ్గరకు నన్ను రమ్మన్నారు. అప్పుడు టైం పదకొండు గంటలయ్యింది. నేను ఏమనుకున్నానంటే 15 నిముషాలలో ఇంటికి వెళ్ళి భోజనం పూర్తి చేసుకుని మధ్యాహ్నం 12 గంటల లోపు బాబా దగ్గరకు వెళ్ళాలనుకున్నాను. ఇంటికి వెళ్ళి చూద్దాము కదా మా అన్నగారు ఎవరో స్థానిక సీనియర్ ప్రభుత్వ అధికారితో మాట్లాడుతూ, నన్ను కొద్దిసేపు

ఆగమన్నాడు. నాతో మాట్లాడాలన్నాడు. ఇంతలో టైం 11.30 అయ్యింది. మా అన్నగారికి మరోమారు గుర్తుచేద్దామన్నట్లు ఆయన ఎదుటికి వెళ్ళగానే, చూడు నీ కారులో ఈ ఆఫీసరు గారిని స్థానిక గెస్ట్ హౌస్‌లో దిగబెట్టమన్నాడు. ఐతే, ఓ 15 నిముషాలలో ఆ పని ముగించుకొని, బాబా దగ్గరకు ఠంచనుగా మధ్యాహ్నం 12 గంటలకు చేరగలననుకున్నాను. ఆయనతో మాట్లాడుతూ మరో 15 నిముషాలు గడిచిపోయాయి. ఏమైతేనేమి ఆ ఆఫీసర్‌ని కారులో ఎక్కించుకొని వేగంగా ట్రావెలర్స్ బంగళా (టి.బి) కేసి బయలుదేరాను. ఎలాగైనా 12 గంటలకల్లా బాబా ఎదుట వుండాలన్నది నా ప్రయత్నం. ఇలా వెళ్తుంటే, దారిలో కొంతమంది పిల్లలు ఏదో ఆడుకుంటూ, వాళ్ళలో వాళ్ళు దెబ్బలాడుకుని ఒక పిల్లవాడు వచ్చి నా కారు చక్రాల క్రింద పడ్డాడు. కారు ఆపి వాచ్ చూసుకున్నాను. అప్పుడు టైం సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలు. అప్పుడు అర్ధమయ్యింది. బాబా నన్ను సరిగ్గా 12 గంటలకు తన దగ్గరకు ఎందుకురమ్మన్నారో. ఈ ప్రమాదం నుండి నన్ను తప్పించడానికే బాబా నన్ను పిలిచారని నాకర్ధమయ్యింది. ఏదైతేనేమి, ఆ తర్వాత ఆ పిల్లవాడిని ఆసుపత్రిలో చేర్పించాను. ఆ తర్వాత ఆ ఆఫీసరుని టి.బిలో దించివేసి, బాబా ఎదుట నిలబడ్డాను. ఆ సమయంలో బాబా వరండాలో అటూ ఇటూ వేగంగా వరండాలో పచార్లు చేస్తున్నారు. నా కోసమే ఎదురు చూస్తున్నారు. బాబా నన్ను చూస్తూనే – "ఏమయ్యిందని" అడిగారు. జరిగినదంతా వివరంగా చెప్పాను. నీవు జైలుకెళ్ళి వుంటావనుకున్నానని ముక్తసరిగా అన్నారు. ఆ దరిమిలా ఆ పిల్లవాడు చనిపోయాడు. నాపై పోలీసు కేసు నమోదు చేసారు. నాలుగు నెలలపాటు ఆ కేసు నడిచింది. ఆ నాలుగు నెలలూ చెప్పలేని మానసిక వ్యధ అనుభవించాను. అలాంటి బాధను నా జీవితంలో నేనెన్నడూ ఎరుగను. చివరాఖరుకు, నా తప్పేమీ లేదని పోలీసులు కేసు కొట్టేశారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, బాబా మాటలు ఆదేశాల పట్ల 'విధేయత' అత్యవసరం. లేదంటే పర్యవసానం మీ కళ్ళెదుటనే చూసారుగా? అలాగే వుంటుంది! మరో సంఘటన. చివరాఖరుగా, 1928 ప్రాంతంలో నేను, కొంతమంది స్నేహితులు మొత్తం 5 మందిని మహాబలేశ్వర్‌కు బయలుదేరాం. బాబా మమ్మల్ని వెళ్ళొద్దన్నారు. ప్రోగ్రామ్‌ని వాయిదా వేసుకోమన్నారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం కదా! ఇప్పుడెలా మానేస్తాం అన్నారు మా స్నేహితులు. మీ ఇష్టం! అన్నారు బాబా. మహాబలేశ్వర్‌కి బయలుదేరిన కొద్దిసేపటికే భళ్ళున వాన మొదలైంది. పూర్తిగా తడిసిపోయాం. వెన్నులోంచి చలి వస్తోంది. అప్పుడు అర్ధమయ్యింది – బాబా ఎందుకు వద్దన్నారో! ఆ సమయంలో మా స్నేహితులకు బాబా పట్ల ఎలాంటి నమ్మకం లేదు. కాని ఆ తర్వాత్తర్వాత మెహెర్‌బాబా కాపాడండి. మమ్మల్ని ఎలాగైనా రక్షించమని వాళ్ళు వేడుకున్నారు. ఆ తర్వాత వాన తగ్గింది. ఆ మర్నాడు క్షేమంగా మా ఇళ్ళకు తిరిగి వచ్చాం. ఇవన్నీ బాబా మాటలు, ఆదేశాల పట్ల విధేయత ఎంత అవసరమో తెలియజేస్తాయి.

## జీవిత సభ్యతం

**2014 మార్చి - ఏప్రిల్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 01. | ఏప్రిల్ | భావూజీ శాఖా గ్రంధాలయం, కోదాడ, నల్గొండ జిల్లా | రూ. 1000.00 |
| 02. | ఏప్రిల్ | సి. హెచ్.వి.వి. సత్యన్నారాయణ, మండపేట, తూర్పు గోదావరి జిల్లా | రూ. 1000.00 |
| 03. | ఏప్రిల్ | యం. రవీందర్ శర్మ, కర్నూలు | రూ. 500.00 |
| 04. | ఏప్రిల్ | సి. హెచ్. సురేందర్ గౌడ్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 3500.00** |

## పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).

2. రెండు దఫాలుగా కూడా రూ. 500/- చొప్పున చెల్లించవచ్చు.

3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలని నిర్ణయించినప్పటికీ నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ. 100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087.**
**ఫోన్:99595-53218,**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**